بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ　　نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ　　وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR**
Qadian

సంపుటి: 11　　www.akhbarbadr.in　　సంచిక: 33

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

### న్యాసములను వాటి హక్కుదారులకు అందజేయవలయును.

اِنَّ اللّٰہَ یَاۡمُرُکُمۡ اَنۡ تُؤَدُّوا الۡاَمٰنٰتِ اِلٰۤی اَہۡلِہَا ۙ وَ اِذَا حَکَمۡتُمۡ بَیۡنَ النَّاسِ اَنۡ تَحۡکُمُوۡا
بِالۡعَدۡلِ ؕ اِنَّ اللّٰہَ نِعِمَّا یَعِظُکُمۡ بِہٖ ؕ اِنَّ اللّٰہَ کَانَ سَمِیۡعًۢا بَصِیۡرًا　　(سورۃ النساء:۵۹)

అనువాదం: " మీరు న్యాసములను వాటి హక్కుదారులకు అందజేయవలెనని నిశ్చయముగా అల్లాహ్ మీకు ఆజ్ఞాపించును. మీరు రాజ్యమేలునప్పుడు న్యాయముగా రాజ్యమేలుడు. అల్లాహ్ మీకు ఉపదేశించినది నిశ్చయముగా చాలా ఉత్తమమైనది. అల్లాహ్ నిశ్చయముగా సర్వ శ్రావణ సమర్థుడు. సర్వసాక్షి. (అన్నిసా: 59)

తేది: 13 ఆగష్టు 2026 క్రీ, శ. 13 జహూర్ 1405 హి, శ. 29 సఫర్ 1448 హి,ఖ.



## ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

### ఎప్పుడైతే న్యాసములు నిర్లక్ష్యము చేయబడుతాయో అప్పుడు ప్రళయ దినం కోసం ఎదురు చూడండి.

عَنۡ أَبِي هُرَيۡرَةَ رَضِيَ اللّٰهُ عَنۡهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ صَلَّى اللّٰهُ عَلَيۡهِ وَسَلَّمَ: "إِذَا ضُيِّعَتِ الۡأَمَانَةُ، فَانۡتَظِرِ السَّاعَةَ". قَالَ: كَيۡفَ إِضَاعَتُهَا يَا رَسُولَ اللّٰهِ؟ قَالَ: "إِذَا أُسۡنِدَ الۡأَمۡرُ إِلَى غَيۡرِ أَهۡلِهِ فَانۡتَظِرِ السَّاعَةَ".


అనువాదం: హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) ఇలా ఉల్లేఖిస్తున్నారు: ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు:" ఎప్పుడైతే న్యాసములు నిర్లక్ష్యము చేయబడుతాయో అప్పుడు ప్రళయ దినం కోసం ఎదురు చూడండి." ఒక వ్యక్తి ఇలా అడిగాడు: ఓ దైవ ప్రవక్తా సల్లల్లాహు అలైహి వసల్లం! వాటిని నిర్లక్ష్యం చేయడం అనగా ఏమిటి?. ప్రవక్త (స) ఇలా తెలిపారు: "అనర్హులైన వ్యక్తులను పాలకులుగా లేదా బాధ్యతాయుతమైన పదవులలో నియమించ బడినప్పుడు ప్రళయ దినం కోసం ఎదరు చూడండి!."

**(బుఖారి, కితాబుర్రిఖాఖ్, బాబ్ రఫఉల్ అమానతహు హదీస్ సంఖ్య 6496)**

عَنۡ أَبِي مُوسَى، عَنِ النَّبِيِّ صَلَّى اللّٰهُ عَلَيۡهِ وَسَلَّمَ، قَالَ: "إِنَّ الۡخَازِنَ الۡمُسۡلِمَ الۡأَمِينَ الَّذِي يُنۡفِذُ، وَرُبَّمَا قَالَ: يُعۡطِي مَا أُمِرَ بِهِ فَيُعۡطِيهِ كَامِلًا مُوَفَّرًا، طَيِّبَةً بِهِ نَفۡسُهُ، فَيَدۡفَعُهُ إِلَى الَّذِي أُمِرَ لَهُ بِهِ أَحَدُ الۡمُتَصَدِّقَيۡنِ".

హజ్రత్ అబూ మూసా (రజి) ఇలా ఉల్లేఖించారు: ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: "ముస్లింల ఆస్తుల సంరక్షకుడిగా లేదా బాధ్యతదారుడిగా నియమించబడిన ఒక ముస్లిం వ్యక్తి నిజాయితీగలవాడై, విశ్వసనీయుడై, తనకు ఇవ్వబడిన ఆదేశాలను సరిగ్గా అమలు చేసి, ఎవరికైనా ఏదైనా ఇవ్వమని ఆదేశించబడినప్పుడు, పూర్తి సంతోషంతో మరియు సదుద్దేశంతో, అది వారి హక్కు అని భావించి వారికి అందిస్తే, అలాంటి వ్యక్తి కూడా ఆచరణలో దానం చేసిన వ్యక్తిలాగే దానం చేసినవాడిగా పరిగణించబడతాడు."

**(ముస్లిం కితాబుజ్జకాత్, బాబ్ అజరుల్ ఖాజినిల్ అమీన్ వల్ మరఅత్)**



### అల్లాహ్ తాలా యొక్క అన్ని న్యాసములను, విశ్వాసభరితమైన ఒప్పందాలను, అలాగే సృష్టిలోని ప్రాణుల అన్ని న్యాసములను మరియు బాధ్యతలను తన శక్తిమేరకు చెల్లించవలెయును.

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ ( మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని) అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:** అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో దైవభీతిని ఒక వస్త్రంగా పేర్కొన్నాడు. అందుకే **లిబాసుత్తక్వా** అని ఖుర్ఆన్‌లో పదంను ఉపయోగించడమైనది. ఆధ్యాత్మిక సౌందర్యం, ఆధ్యాత్మిక అలంకారం ఈ దైవభీతి ద్వారానే కలుగుతుందని ఈ పదం సూచించబడింది. ఒక వ్యక్తి, అల్లాహ్ తాలా యొక్క అన్ని న్యాసములను, విశ్వాసభరితమైన ఒప్పందాలను, అలాగే సృష్టిలోని ప్రాణుల అన్ని న్యాసములను మరియు బాధ్యతలను తన శక్తిమేరకు అత్యంత జాగ్రత్తగా, వాటి సూక్ష్మమైన అంశాల వరకు చెల్లించడమునే దైవభీతి అంటారు. న్యాసము అనగా, మానవ పరిపూర్ణతకు అల్లాహ్ ప్రసాదించిన సమస్త శక్తులు, బుద్ధి, జ్ఞానం, హృదయం, ప్రాణం, ఇంద్రియాలు, భయం, ప్రేమ, గౌరవం, ప్రతిష్ఠ, అలాగే అన్ని ఆధ్యాత్మిక మరియు శారీరక అనుగ్రహాలను, ఒక పరిపూర్ణ మానవుడు పవిత్ర ఖుర్ఆన్‌లోని ఈ వాక్యానికి **ఇన్నల్లాహ యఅమురుకుం అన్ తుఅద్దుల్ అమానాతి ఇలా అహ్లిహా** కు అనుగుణంగా ఈ సమస్త శక్తిసామర్థ్యములను అల్లాహ్ సమక్షంలో తిరిగి సమర్పించడం. అంటే, తన స్వార్థాన్ని పూర్తిగా విడిచిపెట్టి, తనను తాను అల్లాహ్ మార్గంలో పూర్తిగా అంకితం చేసుకోవడం...... ఈ అత్యున్నత, అత్యంత పరిపూర్ణమైన లక్షణం మన ప్రియతమ నాయకుడు, మన దైవాంశ సంభూతుడు , మన మార్గదర్శి, నిరక్షరాస్య ప్రవక్త, సత్యవంతుడు మరియు సత్యనిరూపితుడు హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం గారిలో అత్యంత సంపూర్ణంగా కనిపించింది."

**(ఆయినాయే కమాలాతే ఇస్లాం, పుటలు 161-162)**

### ఈ న్యాసము మీకు అప్పగించబడినప్పుడు, అందులో మీరు ఎన్నడూ ద్రోహం చేయకూడదు.

**హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్, ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ అన్హు సూరహ్ అల్-మువమినూన్‌లోని "వల్లజీనా హుమ్ లి అమానాతిహిమ్ వ అహ్దిహిమ్ రాఊన్" అనే సూక్తిని విశదీకరిస్తూ ఇలా పేర్కొన్నారు:** సహాబాలు (రజి.) ప్రదర్శించిన ఈ ఆదర్శం ఎంత గొప్పదో గమనించండి. క్రైస్తవుల ప్రధాన కేంద్ర నగరమైన హిమ్స్ ముస్లింల ఆధీనంలోకి వచ్చింది. వారు అక్కడి క్రైస్తవుల నుండి పన్ను (జిజ్యా) రూపంలో లక్షల రూపాయలు వసూలు చేశారు. అయితే యుద్ధ పరిస్థితుల దృష్ట్యా ఆ నగరాన్ని ఖాళీ చేయవలసి వచ్చినప్పుడు, అక్కడి బాధ్యతగల వ్యక్తులను పిలిపించి, వారివద్ద నుండి వసూలు చేసిన మొత్తం ధనాన్ని తిరిగి వారికి ఇచ్చారు.ఆపై ఇలా అన్నారు: "మేము మీ ప్రాణాలు, ఆస్తులను రక్షిస్తామని హామీ ఇచ్చి ఈ పన్నును వసూలు చేశాము. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. మేము ఈ నగరాన్ని విడిచి వెళు న్నందున, మీ ధనాన్ని మా వద్ద ఉంచుకోవడం నిజాయితీ మరియు న్యాసపు సూత్రాలకు విరుద్ధమని భావిస్తున్నాము." అలా వారు లక్షల రూపాయలను తిరిగి వారికి అప్పగించారు. క్రైస్తవుల హృదయాలపై ఈ సంఘటన ఎంతో గాఢమైన ప్రభావం చూపిందని చరిత్ర చెబుతుంది. ముస్లిం సైన్యం నగరాన్ని విడిచి వెళ్తున్నప్పుడు, వారు సైన్యంతో పాటు సాగుతూ వీడ్కోలు పలికారు. వారి కళ్లలో కన్నీళ్లు ప్రవహిస్తుండగా వారు ఇలా అన్నారు: "దేవుడు మిమ్మల్ని మళ్లీ మా వద్దకు తీసుకురావాలి. ఎందుకంటే మీలాంటి సత్పాలకులను మేము ఇంతవరకు ఎన్నడూ చూడలేదు." (ఫుతూహుల్ బుల్దాన్, అల్-బలాజిరీ, అమర్ హిమ్స్ వ యౌమ్ అల్-యర్మూక్) అదేవిధంగా, ఇస్లాం పాలనను కూడా ఒక న్యాసముగా ప్రకటించింది. ఈ న్యాసము మీకు అప్పగించబడినప్పుడు, అందులో మీరు ఎన్నడూ ద్రోహం చేయకూడదని ఆదేశించింది. అలాగే పాలనా బాధ్యతలను ఎల్లప్పుడూ నిజాయితీతో నిర్వర్తించగల వ్యక్తుల చేతుల్లోనే ప్రభుత్వ పగ్గాలు ఉండేలా చూడాలని ఉపదేశించింది. అయితే ముస్లింలు ఈ ఆదేశాన్ని కూడా అత్యంత కట్టుదిట్టంగా పాటించారని చరిత్ర సాక్ష్యమిస్తుంది. (తఫ్సీర్ కబీర్ )

**(అహ్మదియ్యా వార్తలు)**

**సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ తాలా కృపతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్యవంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).***

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**సంపాదకీయం:** لَا اِلٰہَ اِلَّا اللّٰہُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰہِ

## అహ్‌లే ఖుర్‌ఆన్, అహ్‌లే అహదీస్‌ల మధ్య గల విభేదాలు: మరియు హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి విశ్వాస భరిత తీర్మాణం.

సౌదీ అరేబియాను గురించి సోషల్ మీడియాలో ఒక వార్త విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ఆ వార్త ప్రకారం, చట్ట నిర్మాణానికి సంబంధించి ముతవాతిర్ (కథకుల పరంపర ప్రవక్త (స)వరకు చేరగల) హదీసులు తప్ప మిగతా అన్ని హదీసులను ఆచరణయోగ్యం కాదని భావించి వాటిని సౌదీ అరేబియా తిరస్కరించిందని పేర్కొన్నారు. కొందరు ముస్లిం మౌల్వీలు లేదా వారి అనుచరులు, ముస్లిం ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి మరియు చాలా సులువుగా ప్రజాదరణ పొందడానికి ఇటువంటి వార్తలను సోషల్ మీడియాలో నిరంతరం ప్రచారం చేస్తుంటారు.

వాస్తవానికి, కొన్ని సంవత్సరాల క్రితం సౌదీ ప్రభుత్వం తమ దేశాన్ని ఆర్థికంగా మరియు సామాజికంగా మరింత బలోపేతం చేయడానికి విజన్ 2030 అనే ప్రణాళికను రూపొందించింది. తద్వారా చమురు ఆదాయంపై మాత్రమే ఆధార పడకుండా సౌదీ అరేబియాను బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎలా తీర్చిదిద్దాలనే దానిపై దృష్టి పెట్టడం దీని ప్రధాన ఉద్దేశ్యం. ఇందులో పర్యాటక రంగ అభివృద్ధి, సాంకేతిక రంగంలో పెట్టుబడుల పెంపు, ఆధునిక నగరాల నిర్మాణం, వినోద కేంద్రాల ఏర్పాటు, మహిళలకు ఉపాధి అవకాశాల విస్తరణ మరియు వారికి మరింత స్వేచ్ఛ కల్పించడం వంటి అంశాలు ఉన్నాయి. ఈ సంస్కరణలలో కొన్ని మతపరమైన మార్పులు కూడా ఉన్నాయి. వాటిలో ఒకటి, చట్ట నిర్మాణంలో ఖుర్‌ఆన్‌తో పాటు ముతవాతిర్ హదీసులను కూడా ఆధారంగా తీసుకోని, ఆహాద్ హదీసులు (కథకుల పరంపర ప్రవక్త (స) వరకు చేరని) మరియు ఖబర్ హదీసులను ( ఒకరు లేదా ఇద్దరు కథకుల ప్రస్తావన గల హదీసులు) తక్కువ స్థాయి వాటిగా పరిగణించడం.

సౌదీ ప్రభుత్వం ఈ విషయంపై ఏమని ప్రకటించిందో, అలాగే ఇటువంటి వార్తలను ప్రచారం చేసి చౌకైన ప్రజాదరణ పొందాలనుకునే కొందరు మౌల్వీలు ఏమి చెబుతున్నారో అనే విషయాలను పక్కన పెడితే, ఈ వర్తమాన ఇమాం అయినా సయ్యదినా హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ (అలైహిస్సలాం) గారు ఖుర్‌ఆన్, సున్నత్ మరియు హదీసుల ద్వారా మార్గదర్శకత్వాన్ని పొందడం గురించి ఏమని బోధించారో పరిశీలిద్దాం. ఉమ్మత్ (ముస్లిం సమాజం) ఎక్కడ ఎక్కడ తడబడిందో, ఎక్కడ మార్గదర్శకత్వం అవసరమైందో, అక్కడ అల్లాహ్ అనుమతితో హుజూర్ (అ) మార్గనిర్దేశం చేశారు.

హుజూర్ (అ) గారి జీవితకాలంలోనే అహ్‌లే ఖుర్‌ఆన్ అనే వర్గం ఏర్పడింది. ఆ కాలంలో దాని ప్రముఖ నాయకుడిగా అబ్దుల్లా చక్రాలవీ సాహిబ్ మరియు గులాం అహ్మద్ పర్వేజ్ సాహిబ్‌లు కొనసాగారు. వీరికి అహ్‌లే హదీస్ పండితులతో తరచుగా చర్చలు జరిగేవి. అలాంటి ఒక చర్చ 1902లో అబ్దుల్లా చక్రాలవీ సాహిబ్ మరియు ముహమ్మద్ హుసైన్ బటాలవీ సాహిబ్ మధ్య జరిగింది. అబ్దుల్లా చక్రాలవీ సాహిబ్ అహ్‌లే ఖుర్‌ఆన్ సిద్ధాంతాన్ని అనుసరించేవారు. మౌల్వీ ముహమ్మద్ హుసైన్ బటాలవీ అహ్‌లే హదీస్ సిద్ధాంతాన్ని అనుసరించేవారు. అబ్దుల్లా చక్రాలవీ సాహిబ్ ఖుర్‌ఆన్‌ను మాత్రమే అంగీకరించి, హదీసులను ఆచరణకు యోగ్యమైనవిగా భావించేవారు కాదు. మరోవైపు, మౌల్వీ ముహమ్మద్ హుసైన్ బటాలవీ సాహిబ్ అభిప్రాయం ప్రకారం, హదీసులు అల్లాహ్ గ్రంథమైన ఖుర్‌ఆన్‌పై తీర్పు చెప్పే స్థాయిలో ఉన్నాయని నమ్మేవారు. ఈ విధంగా ఇద్దరూ అతిశయోక్తి వైఖరిని అవలంబించారు. ఈ చర్చపై హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఒక సమీక్ష రచించారు. అది రూహానీ ఖజాయిన్, సంపుటి 19లో "రివ్యూ బర్ ముబాహసా బటాలవీ వ చక్రాలవీ" అనే శీర్షికతో ప్రచురించబడింది. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆ శీర్షికలో ఖుర్‌ఆన్ మరియు హదీసుల గొప్ప బోధనల ఆధారంగా ఇద్దరికీ ఎంతో విలువైన మార్గదర్శకాన్ని అందించారు. దానిని ఇక్కడ పొందుపర్చడం జరుగుతుంది. ముస్లిం పండితులు మరియు వారి ప్రభుత్వాలకు కూడా ఈ మార్గదర్శకత్వం అనుసరణీయం.

హుజూర్ (అ) ఇలా తెలిపారు: "అల్లాహ్ తాలా మీ మార్గదర్శకత్వం కోసం మీకు మూడు విషయాలను ప్రసాదించాడు. మొదటిది ఖుర్‌ఆన్. రెండవది సున్నత్. అనగా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ కార్యాచరణ ద్వారా చూపిన పవిత్ర ఆదర్శం. ఉదాహరణకు, నమాజ్ ఎలా చేయాలో స్వయంగా చేసి చూపించారు. ఉపవాసం ఎలా ఉండాలో కూడా ఆచరించి చూపించారు. దీనినే సున్నత్ అంటారు. అనగా అల్లాహ్ వాక్యాన్ని తన కార్యాచరణ ద్వారా ఆచరణలో చూపించిన ప్రవక్త (స) గారి మార్గంను సున్నత్ అంటారు. మూడవది హదీస్. అంటే ప్రవక్త (స) మరణానంతరం వారి మాటలను సేకరించి నమోదు చేసిన వచనాలు. హదీసుల స్థానం ఖుర్‌ఆన్ మరియు సున్నత్ కంటే తక్కువ. ఎందుకంటే చాలా హదీసులు సంభావ్యత (జన్ని) ఆధారంగా ఉన్నాయి. అయితే అవి సున్నత్‌కు అనుగుణంగా ఉంటే, సున్నత్ వాటిని నిశ్చితమైనవిగా నిర్ధారిస్తుంది." **(కిస్తీయే నూహ్, పుటలు 33-34, నజారత్ నషర్ వ ఇషాఅత్, ఖాదియాన్, 2018 ప్రచురణ)**

ఈ మార్గదర్శకత్వానికి సంబంధించి, హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) పైన పేర్కొన్న ఇద్దరు ఉలమా (పండితులు) మధ్య జరిగిన చర్చపై చేసిన సమీక్షలో ఇలా పేర్కొన్నారు:

"వాస్తవం ఏమిటంటే, ఈ రెండు వర్గాలలో ఒక వర్గం అతిశయోక్తి (అఫ్రాత్) మార్గాన్ని అనుసరించింది; మరొక వర్గం నిర్లక్ష్య (తఫ్రీత్) మార్గాన్ని అనుసరించింది. మొదటి వర్గానికి చెందిన ముహమ్మద్ హుసైన్ సాహిబ్ ఈ విషయంలో సత్యంపైనే ఉన్నారు. అనగా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి మర్ఫూఅ, (చాలా ప్రాచుర్యం పొందిన) ముత్తసిల్ (ఉల్లేఖుల పరంపర ప్రవక్త (స) వరకు చేరిన) హదీసులను నిరర్థకమైనవిగా లేదా పనికిరానివిగా కొట్టిపారేయడం సరికాదు. అయితే, అతడు స్థాయిల క్రమాన్ని (హిఫ్జ్-ఎ-మరాతిబ్) మరచిపోయి, హదీసులకు ఖుర్‌ఆన్ కంటే ఉన్నత స్థానం కల్పిస్తున్నారు. దాని ఫలితంగా ఖుర్‌ఆన్ మహిమకు భంగం కలుగుతుంది. కొన్నిసార్లు ఖుర్‌ఆన్‌ను తిరస్కరించాల్సిన పరిస్థితి కూడా ఏర్పడుతుంది. ఇది స్పష్టమైన తప్పిదము మరియు న్యాయమార్గం నుండి వైదొలగడమే అనబడుతుంది. అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు: 'ఫబి అయ్యి హదీసిన్ బఅదల్లాహి వ ఆయాతిహీ యుఉమినూన్', అనగా 'అల్లాహ్ మరియు ఆయన సూక్తుల తరువాత వారు ఇంకే హదీస్‌పై విశ్వాసం ఉంచుతారు?' ఇక వారి ప్రత్యర్థి మౌల్వీ అబ్దుల్లా సాహిబ్ మాత్రం తఫ్రీత్ (అతిగా నిర్లక్ష్యం) మార్గాన్ని అనుసరించి, హదీసులను పూర్తిగా తిరస్కరించారు. హదీసులను తిరస్కరించడం ఒక విధంగా ఖుర్‌ఆన్‌ను కూడా తిరస్కరించినట్లే. ఎందుకంటే అల్లాహ్ తఆలా ఖుర్‌ఆన్‌లో ఇలా ఆజ్ఞాపించాడు: 'కుల్ ఇన్ కున్‌తుమ్ తుహిబ్బూనల్లాహ ఫత్తబిఊనీ యుహ్బిబుకుముల్లాహ్', అనగా 'నీవు ఇట్లనుము మీరు అల్లాహ్‌ను ప్రేమిస్తే, నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు.' కాబట్టి, అల్లాహ్ ప్రేమ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రేమతో అనుసంధానమై ఉన్నప్పుడు, వారి(స) ఆచరణను తెలుసుకోవడానికి, వారి(స)ని అనుసరించడానికి అవసరమైన మార్గాలలో హదీస్ కూడా ఒక ముఖ్యమైన సాధనం. అందువల్ల హదీస్‌ను విడిచిపెట్టినవాడు, ప్రవక్త(స)ను అనుసరించే మార్గాన్నే విడిచి పెట్టిన వాడవుతాడు."

మరల హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇతర ముహద్దిసీన్ (హదీస్ పండితులు) మరియు వారి విమర్శకుల విధానాలకు భిన్నంగా, హదీసులను పరిశీలించడానికి ఈ సూత్రాన్ని ప్రతిపాదించారు:

"ఖుర్‌ఆన్ మజీద్ బోధనలకు అనుగుణంగా ఉన్న హదీస్, అది ఎంత బలహీనమైనది (దయీఫ్) అయినప్పటికీ, అంగీకరించబడాలి. మరోవైపు, ఏదైనా హదీస్ ఎంత ప్రామాణికమైనది (ముస్తనద్) లేదా ముతవాతిర్ అయినప్పటికీ, అది ఖుర్‌ఆన్ యొక్క స్పష్టమైన బోధనలకు విరుద్ధంగా ఉంటే, ముందుగా ఆ రెండింటి మధ్య సారూప్యత లేదా సమన్వయం కల్పించడానికి ప్రయత్నించాలి. అయినప్పటికీ విరుద్ధత తొలగకపోతే, అటువంటి హదీస్‌ను వదిలివేయాలి.ఎందుకంటే అది ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి నుండి వచ్చినది కాదని అర్థం. అదేవిధంగా, హుజూర్ (అ) మరల ఇలా కూడా పేర్కొన్నారు: ఏదైనా హదీస్‌లో ఒక భవిష్యవాణి ఉండి, ముహద్దిసీన్ దానిని బలహీనమైనదిగా పరిగణించినప్పటికీ, తరువాత కాలంలో ఆ భవిష్యవాణి నిజమై నెరవేరితే, ఆ హదీస్‌ను సత్యమైనదిగా అంగీకరించాలి. అలాగే, ఆ హదీస్‌ను బలహీనమైనదిగా లేదా కల్పితమైనదిగా (మౌదూ) పేర్కొన్న ముహద్దిసీన్ లేదా రావీలు (వివరణకర్తలు) తప్పు చేశారని భావించాలి. ఇలాంటి భవిష్యవాణులు కలిగిన వందలాది హదీసులు ఉన్నాయి. వాటిలో చాలా వాటిని ముహద్దిసీన్ బలహీనమైనవి, పరంపర తెగినవి (మజ్రూహ్) లేదా కల్పితమైనవి అని పేర్కొన్నారు. అయితే వాటిలో ఏదైనా భవిష్యవాణి నిజమై నెరవేరినప్పుడు, "ఈ హదీస్ బలహీనమైనది కాబట్టి మేము దీనిని అంగీకరించము" లేదా "దాని కథకుడు విశ్వసనీయుడు కాదు" అని తిరస్కరిస్తే, అది మీ స్వంత అవిశ్వాసానికే (బే-ఇమానీకి) నిదర్శనం అవుతుంది. ఎందుకంటే అల్లాహ్ దానిని సత్యమని ప్రత్యక్షంగా నిరూపించిన తరువాత కూడా మీరు దానిని తిరస్కరిస్తున్నారు.

("కిస్తీయే నూహ్" గ్రంథంలోని భావసారాంశం.)

కాబట్టి, హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) హదీసులను పరిశీలించి అంగీకరించడానికి సంబంధించిన నిర్దేశించిన దృఢమైన సూత్రాలు ఇవి. ఈ యుగంలో అల్లాహ్ తరఫున "హకమ్" (న్యాయనిర్ణేత) మరియు "అదల్" (న్యాయపరుడు)గా అవతరించినవారు సమర్పించిన దైవిక నిర్ణయాలను అంగీక రించడం ద్వారానే ఇస్లాం యొక్క బలాన్ని మరియు స్థిరత్వాన్ని కాపాడగలం. అందువల్ల, హదీసులను పరిశీలించడం మరియు వాటిని ఆచరించడం విషయంలో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) అందించిన పై మార్గదర్శకత్వాన్ని అనుసరించడం చాలా ముఖ్యం.

అల్లాహ్ తాలా మనందరికి ఇట్టి భాగాన్ని కల్పించుగాకా!. ఆమీన్.




# జుమా ప్రసంగము

ఆ సమయంలో ప్రపంచమంతా నాకు వ్యతిరేకంగా నిలిచినట్లు అనిపించింది. సాధారణంగా కూడా ఇదే జరుగుతుంది. మనుషులు మీకు హాని చేయాలని నిర్ణయించుకున్నప్పుడు, ప్రపంచమంతా మీకు వ్యతిరేకంగా మారుతుంది. అలాంటి సమయంలో తన నిజమైన సేవకులకు సహాయం చేసేది ఒక్క అల్లాహ్ మాత్రమే."

---

"హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ముఖాన్ని ఒక్కసారి దర్శించగానే, నా హృదయానికి సంపూర్ణ నిశ్చయం కలిగింది. ఈ ప్రపంచమంతా అసత్యమై ఉండ వచ్చు; కానీ ఈ ముఖం మాత్రం అసత్యవాది ముఖం కావడం అసాధ్యం. హుజూర్ (అ) ముఖకాంతిలో ఒక విశేషమైన ఆకర్షణ ఉండేది. వారి ముఖం నుండి వెలువడే దివ్యప్రకాశం హృదయాలను ఆకర్షించేది."

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 8 మే 2026 ( 8 హిజ్రత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

اَمَّا بَعْدُ فَاَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ -

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి జీవితం మరియు ఉన్నతమైన వ్యక్తిత్వం గురించి వివరిస్తూ, వారి సత్యనిదర్శనంకు సంబంధించిన కొన్ని సంఘటనలను నేను ప్రస్తావించాను.

ఈ రోజు, అలాంటి మరికొన్ని సంఘటనలను ప్రస్తావించుతాను.

డాక్టర్ హెన్రీ మార్టిన్ క్లార్క్ తనపై హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) హత్యాయత్నం చేశారని ఆరోపిస్తూ ఒక కేసు దాఖలు చేశాడు. ఇది అత్యంత ప్రమాదకరమైన కేసు. హుజూర్ (అ) ఇలా తెలిపారు: "హెన్రీ మార్టిన్ క్లార్క్ దాఖలు చేసిన ఈ కేసు ఎంత తీవ్రమైందంటే, అది మరణదండన విధించే స్థాయికి కూడా వెళ్లే అవకాశం ఉండేది. రోమన్ పాలనలో యూదులు ఈసా (అలైహిస్సలాం)పై దాఖలు చేసిన కేసును ఉదాహరణగా తీసుకొని ఇలా చెబుతున్నారు. 'నాపై కూడా దాదాపు అలాంటి కేసే దాఖలైంది. అయితే తేడా ఏమిటంటే, ఈసా (అలైహిస్సలాం)పై యూదులు కేసు పెట్టగా, నాపై ఒక క్రైస్తవ పాస్టర్ మరియు వైద్యుడైన డాక్టర్ మార్టిన్ క్లార్క్ హత్యాయత్నం చేశానని ఆరోపించాడు. అతను సమర్పించిన సాక్ష్యాలు ఎంతో బలంగా కనిపించాయి. అంతేకాక, ఈ జమాఅత్‌కు తీవ్రమైన ప్రత్యర్థి అయిన మౌల్వీ అబూ సయీద్ ముహమ్మద్ హుసైన్ బటాల్వీ కూడా సాక్షిగా హాజరై, నాపై కేసును బలపరచడానికి తన శక్తిమేరకు ప్రయత్నించాడు. ఈ కేసును గుర్దాస్‌పూర్ డిప్యూటీ కమిషనర్ అయిన కెప్టెన్ డగ్లస్ విచారించాడు. తరువాత ఆయనను బహుశా సీమ్లాకు బదిలీ చేశారు. కేసు పూర్తి విచారణకు వచ్చింది. నాపై ఉన్న సాక్షులందరినీ ఎంతో ఆర్భాటంగా, హడావుడిగా హాజరు పరిచారు. ఆ పరిస్థితుల్లో అత్యుత్తమ న్యాయవాది కూడా నేను నిర్దోషిగా విడుదల అవుతానని చెప్పలేని స్థితి. అప్పటి పరిస్థితులు మరియు ఇతర అంశాలన్నీ ఈ కేసును సెషన్స్ కోర్టుకు పంపించాల్సిందేనని సూచించాయి. అక్కడ జీవిత ఖైదు లేదా మరణదండన విధించే అవకాశమూ ఉండేది.కానీ, అల్లాహ్ తఆలా ముందుగానే ఈ కేసు గురించి, 'అనగా నేను నిర్దోషిగా విడుదల అవుతానని' ముందుగానే నాకు తెలియజేశాడు. నా జమాఅత్‌కు చెందిన అనేక మందికి ఈ దివ్యవాణి గురించి తెలుసు. కేసు విచారణ చివరి దశకు చేరింది, అక్కడ అభియోగ పక్షం మరియు నా ప్రత్యర్థులు మేజిస్ట్రేట్ ఈ కేసును సెషన్స్ కోర్టుకు పంపిస్తాడని నమ్ముతున్నారు. అప్పుడు కెప్టెన్ డగ్లస్ పోలీసు సూపరింటెండెంట్‌తో మాట్లాడుతూ, ఈ కేసు కుట్రపూరితంగా సృష్టించబడిందనే బలమైన భావన తనకు కలుగుతుందని చెప్పాడు. డాక్టర్ క్లార్క్‌పై నిజంగా ఎటువంటి హత్యాయత్నం జరిగిందని, లేదా నిందితుడు ఎవరినైనా పంపి అతన్ని చంపడానికి ప్రయత్నించాడని తాను నమ్మడం లేదని చెప్పాడు. అందువల్ల, ఈ కేసును స్వయంగా తిరిగి దర్యాప్తు చేయాలని పోలీసు సూపరింటెండెంట్‌ను ఆదేశించాడు." సర్వశక్తిమంతుడైన అల్లాహ్ న్యాయమూర్తి హృదయంలో ఈ కేసును మళ్లీ దర్యాప్తు చేయాలని పోలీసు అధికారికి ఆదేశించాలనే ఆలోచన కలిగించాడు. హుజూర్ (అ) ఇలా తెలిపారు: "ఆ సమయంలో నా ప్రత్యర్థులు నాపై కుట్రలు పన్నడమే కాకుండా, తమ ప్రార్థనలు అంగీకరించ బడతాయని చెప్పుకునే వారు కూడా కన్నీళ్లతో అల్లాహ్‌ను ప్రార్థిస్తూ నాకు శిక్ష పడాలని వేడుకుంటున్నారు. కానీ అల్లాహ్‌కు ఎవరు ఎదురు నిలవగలవారు ?. కొంతమంది కెప్టెన్ డగ్లస్‌ను కూడా సంప్రదించి, ఆయనను ప్రభావితం చేయడానికి ప్రయత్నించిన విషయం నాకు తెలుసు. కానీ ఆయన న్యాయపరుడూ, నిష్పాక్షికుడూ అయిన మేజిస్ట్రేట్. అందువల్ల ఆయన వారికి, 'ఇలాంటి అన్యాయానికి నేను భాగస్వామి కాలేను' అని స్పష్టంగా చెప్పారు. అంటే, తప్పుడు తీర్పు ఇవ్వడానికి తాను సిద్ధంగా లేనని వెల్లడించారు."

మొత్తానికి, కేసును తిరిగి దర్యాప్తు చేయడానికి కెప్టెన్ లే మార్చాండ్‌కు అప్పగించినప్పుడు, ఆయన అబ్దుల్ హమీద్‌ను పిలిచి నిజం చెప్పమని ఆదేశించారు. అబ్దుల్ హమీద్ మొదట డిప్యూటీ కమిషనర్ ముందు చెప్పిన అదే పాత కథను మళ్లీ చెప్పాడు. నిజానికి, తన మొదటి వాంగ్మూలం నుండి కొద్దిపాటి తేడా వచ్చినా తనపై కేసు నమోదవుతుందని ముందుగానే హెచ్చరించ బడినందువల్ల, అతను మునుపు చెప్పిన అదే వాంగ్మూలాన్ని పునరావృతం చేశాడు. పోలీస్ సూపరింటెండెంట్ అతనితో, "నువ్వు ఇదే కథను ఇప్పటికే చెప్పావు. కానీ నువ్వు నిజం చెబుతున్నావని డిప్యూటీ కమిషనర్‌కు నమ్మకం కలగలేదు" అని అన్నాడు. కెప్టెన్ లే మార్చాండ్ మళ్లీ నిజం చెప్పమని అనగానే, అబ్దుల్ హమీద్ ఏడవడం ప్రారంభించి కెప్టెన్ కాళ్లపై పడి తనకు రక్షణ కల్పించమని వేడుకున్నాడు. కెప్టెన్ అతనికి ధైర్యం చెప్పి, భయపడకుండా నిజం చెప్పమని ప్రోత్సహించారు. అప్పుడు అతను అసలు నిజాన్ని వెల్లడించాడు. తాను ముందు ఇచ్చిన వాంగ్మూలం బలవంతంగా చెప్పించబడిందని ఒప్పుకుని, మిర్జా సాహిబ్ తనను ఎవరినీ హత్య చేయడానికి ఎప్పుడూ పంపలేదని సాక్ష్యమిచ్చాడు. "ఈ వాంగ్మూలం విన్న కెప్టెన్ ఎంతో సంతోషించి, కేసును ఛేదించానని డిప్యూటీ కమిషనర్‌కు వెంటనే టెలిగ్రామ్ పంపించారు. అనంతరం కేసు మళ్లీ గుర్దాస్‌పూర్‌లో విచారణకు వచ్చింది. కెప్టెన్ లే మార్చాండ్ ప్రమాణం చేసి తన అఫిడవిట్‌ను నమోదు చేశారు." హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: "ఆ సమయంలో కోర్టులో నేను గమనించినది ఏమిటంటే, నిజం బయట పడినందుకు డిప్యూటీ కమిషనర్ స్పష్టంగా సంతోషించారు. అయితే, నా మీద తప్పుడు సాక్ష్యం ఇచ్చిన క్రైస్తవులపై ఆయన తీవ్ర ఆగ్రహంతో కూడా ఉన్నారు. ఆయన నాతో మాట్లాడుతూ, వారిపై దావా వేయడానికి నాకు హక్కు ఉందని చెప్పారు. కానీ నేను న్యాయపరమైన వివాదాలకు పూర్తిగా దూరంగా ఉండే స్వభావం కలవాడిని కాబట్టి, 'నేను ఎలాంటి వ్యాజ్యంలోనూ ప్రవేశించదలచుకోను. నా దావా దేవుని సమక్షంలో ఇప్పటికే దాఖలై ఉంది' అని చెప్పాను.

అప్పుడు కెప్టెన్ డగ్లస్ వెంటనే తీర్పును రాసి, అక్కడ గుమికూడిన అనేకమంది ప్రజల సమక్షంలో చదివి వినిపించారు. తర్వాత నాతో మాట్లాడుతూ, 'అభినందనలు, మీరు నిర్దోషిగా విడుదలయ్యారు' అని అన్నారు.

ఆ సమయంలో ప్రపంచమంతా నాకు వ్యతిరేకంగా నిలిచినట్లు అనిపించింది. సాధారణంగా కూడా ఇదే జరుగుతుంది. మనుషులు మీకు హాని చేయాలని నిర్ణయించుకున్నప్పుడు, ప్రపంచమంతా మీకు వ్యతిరేకంగా మారుతుంది. అలాంటి సమయంలో తన నిజమైన సేవకులకు సహాయం చేసేది ఒక్క అల్లాహ్ మాత్రమే."

**(లేఖ్చర్ లుదియానా, రూహాని ఖజాయిన్ సంపుటి 20, పేజి 268-270)**

ఈ కేసుకు సంబంధించిన మరో సంఘటనలో, అహ్మదీయేతర న్యాయవాది మౌల్వీ ఫజల్ దిన్ కూడా హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి సత్యనిదర్శనం మరియు ఉన్నత నైతిక స్వభావాన్ని ప్రశంసిస్తూ సాక్ష్యమిచ్చారు. ఈ విషయాన్ని హజ్రత్ షేఖ్ యాకూబ్ అలీ ఇర్ఫానీ (రహిమహుల్లాహ్) తన హయాత్-ఎ-అహ్మద్ అనే గ్రంథంలో నమోదు చేశారు. అందులో వారు ఇలా వ్రాసారు:

"ఈ కేసులోనే హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి సత్యనిదర్శనంకు మరొక గొప్ప నైతిక ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. అది హుజూర్ (అ)కు సత్యంపై ఉన్న అపారమైన ప్రేమను స్పష్టంగా నిరూపించింది.

"ఈ సంఘటనను దివంగత మౌల్వీ ఫజల్ దిన్ సాహిబ్, ఒక న్యాయవాది, చెప్పిన మాటలలో వినండి. ఈ వివరాలను నా ఆప్త మిత్రుడు, దేశ్ మరియు హిందుస్తాన్ పత్రికల సంపాదకుడు లాలా దినా నాథ్ వివరించారు."

(దేశ్ మరియు హిందుస్తాన్ అనే రెండు పత్రికలకు ఈ హిందూ మహాశయుడు సంపాదకుడు. ఆయన హజ్రత్ షేఖ్ యాకూబ్ అలీ ఇర్ఫానీ (రహిమహుల్లాహ్)కు కూడా సన్నిహిత మిత్రుడు.)

ఆయన ఇలా చెప్పారు: "మిర్జా సాహిబ్‌ను నేను ఎంతగానో గౌరవిస్తానని మీకు తెలుసు. వారి స్థానం, ప్రతిష్ఠలు అత్యంత ఉన్నతమైనవని నేను భావిస్తాను. అయితే, వారు చేసిన దావాల విషయానికి వస్తే, మానసిక శాస్త్ర దృష్టికోణంలో చూస్తే, వారు తన అనుభవాన్ని అర్థం చేసుకోవడంలో పొరబడ్డారని, వారు చేసిన ఆ దావాలు నిజం కావని నేను నమ్ముతున్నాను. (ఇది ఆ న్యాయవాది వ్యక్తిగత అభిప్రాయం.) అయినప్పటికీ, వారు నిస్సందేహంగా ఒక ధర్మాత్ముడు, మహోన్నత ఆత్మీయుడు, మరియు అత్యున్నత స్థాయి ఆధ్యాత్మికత గల వ్యక్తి. వారి గురించి నాకు ఈ విశ్వాసం ఒక ప్రత్యేక సంఘటన వల్ల ఏర్పడింది." ఆ సంఘటనను ఆయన ఈ విధంగా వివరించారు: "హకీమ్ గులామ్ నబీ జుబ్దత్-ఉల్-హుకమా గురించి మీకు తెలుసు. అలాగే న్యాయవాది మౌల్వీ ఫజల్ దిన్ సాహిబ్ గురించి కూడా మీకు తెలుసు." ఇక్కడ హిందూ సంపాదకుడు ఈ సంఘటనను వివరిస్తూ, ఇప్పుడు మౌల్వీ ఫజల్ దిన్ సాహిబ్ చెప్పిన మాటలను తెలియపరుస్తున్నారు.

అతను ఇలా చెప్పాడు: "మౌల్వీ ఫజల్ దిన్ సాహిబ్ అనే న్యాయవాది కూడా మీకు బాగా తెలుసు. సాయంత్రం వేళల్లో ప్రజలు హకీమ్ సాహిబ్ ఇంట్లో సమావేశమయ్యేవారు. నేను కూడా అక్కడికి వెళ్తుండేవాడిని. ఒక రోజు అక్కడ అనేక మంది స్నేహితులు కూడి ఉన్నారు. యాదృచ్ఛికంగా మిర్జా సాహిబ్ గురించి ప్రస్తావన వచ్చింది. ఒక వ్యక్తి వారిని తీవ్రంగా వ్యతిరేకించడం ప్రారంభించాడు. అయితే అతను మాట్లాడిన తీరు మర్యాద, నీతి ప్రమాణాలకు పూర్తిగా విరుద్ధంగా ఉంది." ఇది విన్న ది హిందూ పత్రిక సంపాదకుడు ఇలా అన్నాడు: "దివంగత మౌల్వీ ఫజల్ దిన్ సాహిబ్ ఇది విన్న వెంటనే ఎంతో ఆవేశానికి లోనయ్యారు. ఆయన ఎంతో భావోద్వేగంతో ఇలా అన్నారు: 'నేను మిర్జా సాహిబ్‌కు శిష్యుడిని కాదు. వారు చేసిన వాగ్దానాలను కూడా, ఏ కారణం చేతనైనా సరే నేను అంగీకరించను. కానీ వారు గొప్ప వ్యక్తిత్వం గలవారు, వారి ఉన్నత నైతికతపై నాకు దృఢమైన విశ్వాసం ఉంది. 'నేను ఒక న్యాయవాదిని. న్యాయపరమైన వ్యవహారాల కోసం అన్ని వర్గాల ప్రజలు నా వద్దకు వస్తుంటారు. నేను వేలాది మంది వ్యక్తులను ప్రత్యక్షంగా చూశాను. ఇతర న్యాయవాదుల ద్వారా కూడా ఎంతో మందిని గమనించాను. అత్యంత నీతిమంతులుగా పేరొందిన వ్యక్తులు కూడా వారిలో కపటం లేదా ఆడంబరం ఉంటుందని ఎవరూ ఊహించ లేనివారు. కోర్టు వ్యవహారాల్లో న్యాయ సలహా ఇచ్చినప్పుడు అవసరమని భావిస్తే తమ వాంగ్మూలాన్ని మార్చడానికి ఏమాత్రం వెనుకాడలేదు.'కానీ నా జీవితమంతా నేను గమనించిన వారిలో, నిజం నుండి ఒక్క ఇంచు కూడా తొలగిపోని ఏకైక వ్యక్తి మిర్జా సాహిబ్ మాత్రమే.

'వారికు సంబంధించిన ఒక కేసులో (హెన్రీ మార్టిన్ క్లార్క్ కేసును సూచిస్తూ) నేను వారి తరపున న్యాయవాదిగా ఉన్నాను. ఆ కేసులో నేను ఒక చట్టపరమైన ప్రకటనను సిద్ధం చేసి వారికి చూపించాను. దాన్ని చదివిన తర్వాత వారు, "ఇందులో అసత్యం ఉంది" అని అన్నారు. 'అప్పుడు నేను, "నిందితుడి ప్రకటన ప్రమాణం మీద ఇవ్వబడదు. చట్టప్రకారం అతనికి తాను కోరిన విధంగా చెప్పే హక్కు ఉంది" అని చెప్పాను."

అందుకు హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా సమాధానం ఇచ్చారు: "ఒక వ్యక్తి తాను కోరినట్లు మాట్లాడేందుకు చట్టం అనుమతించ వచ్చు. కానీ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అలాంటి వాటికి అనుమతిని ఇవ్వడు. అల్లాహ్ ఎప్పుడూ అబద్ధం చెప్పడానికి అనుమతి ఇవ్వలేదు. నిజానికి చట్టం యొక్క అసలు ఉద్దేశమూ అదికాదు. కాబట్టి వాస్తవాలకు విరుద్ధంగా నేను ఎప్పటికీ ప్రకటన ఇవ్వను. విషయం ఎలా ఉందో అచ్చం అలాగే తెలియజేస్తాను."

దీనిపై మౌల్వీ సాహిబ్ (న్యాయవాది) ఇలా అన్నారు:

"అప్పుడు నేను వారితో, 'మీరు తెలిసీ తెలిసీ మీకే కష్టాన్ని తెచ్చుకుంటున్నారు' అని చెప్పాను.''దీనికి హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా సమాధాన మిచ్చారు: "నాకు నిజమైన ప్రమాదం ఏమిటంటే, అన్యాయమైన ప్రయోజనం పొందడానికి చట్టపరమైన ప్రకటనలో అసత్యాన్ని చేర్చి, దాని వల్ల నా ప్రభువైన అల్లాహ్ అసంతృప్తిని సంపాదించుకోవడం. అది నేను ఎట్టి పరిస్థితుల్లోనూ చేయలేను. ఏం జరిగినా సరే." ఈ సంఘటనను లాలా దినా నాథ్ సాహిబ్ (పత్రిక సంపాదకుడు) షేఖ్ యాకూబ్ అలీ ఇర్ఫానీ సాహిబ్‌కు వివరించారు. ఆయన ఇలా చెప్పారు: "మౌల్వీ ఫజల్ దిన్ సాహిబ్ తరచూ ఇలా చెప్పేవారు: 'హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఈ మాటలను ఎంతటి దృఢసంకల్పంతో చెప్పారంటే, వారి ముఖంపై ఒక అసాధారణమైన ఉత్సాహం, ఆత్మవిశ్వాసం స్పష్టంగా కనిపించింది. అది విన్న తర్వాత నేను (అంటే న్యాయవాది) వారితో, "నా న్యాయవాద సేవల వల్ల మీకు ఎలాంటి ప్రయోజనం ఉండదు" అని అన్నాను. అప్పుడు వారు ఇలా సమాధానమిచ్చారు:

"మీ వాదన వల్ల గానీ, మరే ఇతర వ్యక్తి ప్రయత్నాల వల్ల గానీ నాకు ఏదైనా ప్రయోజనం కలుగుతుందని నేను ఎప్పుడూ ఊహించలేదు. అలాగే ఒకరి వ్యతిరేకత వలనా నేను నాశనం అవుతానని కూడా నేను నమ్మను. నా విశ్వాసం ఒక్క సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌పైనే ఉంది. ఆయన నా హృదయాన్ని చూస్తాడు. మీ నిజాయితీ నాకు తెలుసు కాబట్టి, అందుబాటులో ఉన్న సాధనాలను ఉపయోగించడం సముచితమని భావించి మిమ్మల్ని నా న్యాయవాదిగా నియమించాను. ఇది కేవలం ఉపయోగించవలసిన ఒక బాహ్య సాధనం మాత్రమే. అందుకే నేను దానిని ఉపయోగిస్తున్నాను. నేను మీపై ఆధారపడి లేను."

మౌల్వీ ఫజల్ దిన్ సాహిబ్ ఇంకా ఇలా చెప్పేవారు:

"నేను మళ్లీ, 'నేను సిద్ధం చేసిన ఈ ప్రకటననే తెలియజేయండి' అని విజ్ఞప్తి చేశాను. కానీ హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా అన్నారు:'లేదు. నేను స్వయంగా వ్రాసిన ప్రకటననే యథాతథంగా సమర్పించండి. దాని ఫలితం ఏమవుతుందో అనే ఆందోళన అవసరం లేదు. ఒక్క మాట కూడా మార్చకూడదు. నేను పూర్తి నిశ్చయంతో చెబుతున్నాను. మీరు సిద్ధం చేసిన చట్టపరమైన ప్రకటనకన్నా ఇది మరింత ప్రభావవంతంగా ఉంటుంది. మీరు భయపడుతున్న ఫలితం సంభవించదు. అల్లాహ్ చిత్తమైతే ఫలితం శుభప్రదంగానే ఉంటుంది. ఒకవేళ ప్రపంచ దృష్టిలో ఫలితం అనుకూలంగా కనిపించకపోయినా, అనగా నాకు శిక్ష పడినా, అదీ నాకు ఏమాత్రం బాధ కలిగించదు. ఎందుకంటే అప్పుడు నా ప్రభువుకు అవిధేయత చూపలేదనే ఆనందం నాకు ఉంటుంది.'"

లాలా దినా నాథ్ తరచుగా ఇలా చెప్పేవారు: "మౌల్వీ ఫజల్ దిన్ సాహిబ్ హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తరపున ఎంతో ఉత్సాహంతో, మనస్ఫూర్తిగా వాదించారు. అంతేకాక, హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) చేసిన ప్రకటనను అక్కడి కక్కడే లిఖితపూర్వకంగా నమోదు చేశారు. ఇది దేవుని ప్రత్యక్ష సహాయశక్తికి అద్భుతమైన నిదర్శనం. ఎందుకంటే వారు రాసిన అదే ప్రకటన ఆధారంగా హజ్రత్ అఖ్దస్ మసీహ్‌మౌవూద్ (అలైహిస్సలాం) నిర్దోషిగా విడుదలయ్యారు."

మౌల్వీ ఫజల్ దిన్ సాహిబ్, హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి సత్యనిదర్శనంను, అలాగే సత్యం కోసం ఎలాంటి కష్టాన్నైనా ధైర్యంగా, నిర్భయంగా భరించే వారి గొప్ప ధైర్యసాహసాలను వివరించారు. ఆయన మాటలు సభలో ఉన్న వారందరినీ ఎంతో భావోద్వేగానికి గురిచేశాయి. బయట కూర్చొని వారిని వ్యతిరేకిస్తున్నవారు కూడా నిశ్శబ్దంగా ఉండిపోయారు.

అప్పుడు కొందరు ఆయనను అడిగారు:

"అయితే మీరు ఎందుకు వారి అనుచరుడిగా మారడం లేదు?"

దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు:

"అది నా వ్యక్తిగత నిర్ణయం. దాని గురించి నన్ను ప్రశ్నించే హక్కు మీకు లేదు. నేను వారిని సంపూర్ణ సత్యవంతుడిగా భావిస్తున్నాను. నా హృదయంలో వారి పట్ల అపారమైన గౌరవం ఉంది."

**(1947 వరకు గల పాకిస్తాన్‌కు చెందిన సంచికలు మరియు పత్రికల ఆధారంగా డా. అబూ సల్మాన్ షాజహాన్‌పురి, పేజి 120, 236. ముఖ్తదర ఖౌమి జబాన్ ఇస్లామాబాద్ 1987)(అల్ హకమ్, సంచిక 41, సంపుటి 37, 14 నవంబర్ 1934, పుటలు 3-4)( హయాతే అహ్మద్, సంపుటి 4, పుటలు 566-569)**

ఇదే సంఘటనకు సంబంధించి మాస్టర్ నజీర్ హుసైన్ సాహిబ్ మరో వృత్తాంతాన్ని వివరించారు. ఆయన ఇలా చెబుతున్నారు:

"దివంగత మౌల్వీ ఫజల్ దిన్ సాహిబ్, హైకోర్టు న్యాయవాది. ఆయనకు హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) పట్ల ఎంతో అభిమానముండేది. సాధారణంగా వారి న్యాయపరమైన కేసులన్నింటిలోనూ ఆయనతో పాటు ఉండేవారు.

ఒకసారి ఆయన నాతో మాట్లాడుతూ, 'హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) సత్యనిదర్శనంలో అత్యున్నత స్థాయిలో ఉన్న వ్యక్తి' అని చెప్పారు. దాని గురించి నేను వివరంగా అడిగినప్పుడు, ఆయన ఈ సంఘటనను వివరించారు.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) మరియు డిప్యూటీ మార్టిన్ క్లార్క్‌ల మధ్య జరిగిన ఒక కేసులో, అబ్దుల్ హమీద్ అనే వ్యక్తి, 'మార్టిన్ క్లార్క్‌ను హత్య చేయడానికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తనను పంపారు' అని కోర్టులో సాక్ష్యం ఇచ్చాడు. ఆ సమయంలో, దివంగత మౌల్వీ ఫజల్ దిన్ సాహిబ్ న్యాయవాదిగా వ్యవహరిస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)తో ఇలా అన్నారు: "కోర్టులో మీరు కేవలం 'నాకు అబ్దుల్ హమీద్ గురించి తెలియదు' అని మాత్రమే చెప్పండి. ఆ తర్వాత మిగతా న్యాయపరమైన వ్యవహారాలన్నింటినీ మేమే చూసుకుంటాము. (మీరు అతన్ని ఎరుగనని మాత్రమే

చెప్పండి.)"

ఆ న్యాయవాది చెప్పిన ప్రకారం, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) అలా ఒక్క మాట చెబితే కేసులో విజయం ఖచ్చితమని, లేకపోతే నిర్దోషిగా విడుదల కావడం అసాధ్యమని ఆయన అన్ని విధాలా నచ్చజెప్పారు. అయితే, తన సూచనలను పూర్తిగా విన్న తరువాత, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా సమాధాన మిచ్చారు: "నేను ఈ లోకానికి సత్యాన్ని స్థాపించడానికి వచ్చాను. నన్ను ఉరితీసినా నేను ఎప్పటికీ అబద్ధం చెప్పను. నాకు అబ్దుల్ హమీద్ తెలుసు. అతను ఖాదియాన్‌కు వచ్చేవాడు. ఏ పరిస్థితి వచ్చినా, అతను నాకు తెలియదని నేను ఎన్నటికీ చెప్పను."

న్యాయవాది దివంగత మౌల్వీ ఫజల్ దీన్ సాహిబ్ ఇలా వివరిస్తున్నారు:

"అప్పుడు నేను ఇలా వినతిచేశాను: 'ప్రాణరక్షణ చేయడం విధి. కాబట్టి మీరు అబద్ధం చెప్పదలచు కోకపోతే, కనీసం మీకు ఆయన గురించి తెలుసని స్పష్టంగా అర్థం కాకుండా ఉండే విధంగా సమాధానం ఇవ్వండి. (అబద్ధం చెప్పవద్దు, కానీ అస్పష్టమైన సమాధానం ఇవ్వండి.)' దీనికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా అన్నారు: 'నేను అలా కూడా చేయలేను. తన ఆదర్శాన్ని ప్రపంచానికి చూపించడానికి దేవుడు నన్ను పంపించాడు. కేవలం నా ప్రాణాన్ని కాపాడుకోవడం కోసం అలాంటి ఆదర్శాన్ని నేను చూపించడానికి సిద్ధంగా లేను. సత్యం మాట్లాడుతున్నందుకు నా ప్రాణం పోయినా, నేను విజయవంతుడినే.'

దివంగత మౌల్వీ ఫజల్ దీన్ సాహిబ్ (అహ్మదీయేతరుడు) ఇంకా ఇలా చెప్పారు:"ఆ సమయంలో మేమంతా పూర్తిగా నిరాశకు గురయ్యాము. కోర్టులో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇచ్చిన వాఙ్మూలమును చదివినప్పుడు, వారు అబ్దుల్ హమీద్ తనకు తెలుసని బహిరంగంగా అంగీకరించారని తెలిసింది. దాంతో ఇక నిర్దోషిగా విడుదల కావడం అసాధ్యమని మేము నిశ్చయించుకున్నాము. అయితే ఆ కేసులో అల్లాహ్ వారికి చేసిన సహాయాన్ని చూసినప్పుడు, దేవుడు తన నియమిత సేవకునికి ఎలా తోడ్పడ్డాడో, అంత తీవ్రమైన కేసులో వారు ఎలా గౌరవ ప్రదంగా నిర్దోషిగా విడుదలై విజయం సాధించారో చూసి మేము ఆశ్చర్యపోయాము."

**(రివాయాత్ అషాబ్-ఎ-అహ్మద్, సంపుటి 3, పుటలు 173--174)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరులు (రజియల్లాహు అన్హుమ్) తమ ప్రాణాలను సంతోషంగా త్యాగం చేశారు. కానీ సత్యాన్ని ప్రకటించడంలో ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు. వారు నిర్మించిన సామ్రాజ్యానికి చరిత్రలో సాటి లేదు. దానికి కారణం ఏమిటి? వారిలో చిత్తశుద్ధి, సత్యనిష్ఠత, విశ్వాసపాత్రత ఉండేవి. ఇలాంటి జాగ్రత్తల పేరుతో సత్యాన్ని దాచాలని కోరేవారు నిజానికి నాస్తికులు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసం ఉంచి, ఆయన కొరకు కార్యం చేసేవారు, ఆయన సహాయం తప్పకుండా వస్తుందని తెలుసు కుంటారు. అందువల్ల వారు సత్యాన్ని ప్రకటించడంలో ఎటువంటి సంకోచం చూపరు.

అల్లాహ్‌కు నిజమైన దాసులు ఎన్నడు అసత్యం పలకరు; సత్యాన్ని కూడా దాచిపెట్టరు. "నీవు మసీహ్ మౌవూద్ గా ప్రకటిస్తున్నావా?" అని నన్ను అడిగినచో, నేను ఎలా సమాధానం ఇస్తానో చూపిస్తాను. సత్యం, ధైర్యం లేకుండా ఏ పని సఫలం కాదు. నాపై ఎన్నో కేసులు పెట్టబడ్డాయి. కానీ వాటి ఫలితం ఏమైంది? ఈ విషయాలకు భయపడి నేను ఎప్పుడైనా వెనక్కి తగ్గానని ఎవరైనా చెప్పగలరా? అలా తగ్గడం అంటే షిర్క్ (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం)యే అని అర్థం. దేవుడు ఉన్నాడని, ఆయన తన నిజాయితీగల సేవకులకు సహాయం చేస్తాడని నాకు సంపూర్ణ నమ్మకం ఉంది. నేను ప్రమాణపూర్వకంగా చెబుతున్నాను: 'లా ఇలాహ ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప మరెవ్వరు ఆరాధనకు అర్హుడు లేరు) అని మనస్ఫూర్తిగా ప్రకటించే వ్యక్తికి తోడుగా మహోన్నతుడైన అల్లాహ్ ఉంటాడు. ఈ సారాంశాన్ని నిజంగా మనిషిలో సృష్టించే ఏకైక మతం ఇస్లాం."

(మల్ఫూజాత్, సంపుటి 9, పుటలు 254, ముద్రణ 2022)

ఈ దైవానుగ్రహం కేవలం హుజూర్ (అ)కే పరిమితం కాలేదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తెల్పిన ప్రకారం, ఇది ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. మనస్ఫూర్తిగా ఈ విశ్వాసాన్ని ప్రకటించి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌పై నిజమైన నమ్మకం ఉంచినవారు రక్షింపబడతారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)గూర్చి బాల్యం నుండి తెలిసిన ఒక హిందూ వ్యక్తి ఇచ్చిన సాక్ష్యం కూడా ప్రస్తావించబడింది. ఆయన ఇలా అన్నారు:

"మిర్జా గులామ్ అహ్మద్‌ను గూర్చి నాకు చిన్నప్పటి నుండి తెలుసు. మేమిద్దరం ఒకే వయస్సు వారము. ఖాదియాన్‌తో నాకు ఎప్పుడూ సన్నిహిత సంబంధం ఉంది. ఇప్పటికీ నేను గమనిస్తున్నది ఏమిటంటే, ఈ రోజు వారిలో కనిపిస్తున్న ఉన్నతమైన నైతిక గుణాలు, గొప్ప అలవాట్లు మొదటి నుంచే వారిలో ఉండేవి."

ఆయన హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి గుణంను గురించి మాట్లాడుతూ ఇలా రాశారు:

"వారు సత్యవంతుడు, విశ్వసనీయుడు, సద్గుణసంపన్నుడు. నిజానికి నా అభిప్రాయం ప్రకారం, పరమేశ్వరుడే మిర్జా సాహిబ్ రూపంలో భూమిపై అవతరించాడు. పరమేశ్వరుడు తన మహిమలను వారి ద్వారా వ్యక్తపరుస్తున్నాడు."

**(తజ్కిరతుల్ మహ్దీ, సంపుటి 2 హజ్రత్ పీర్ సిరాజుల్ హక్ నుమానీ, పుట 303)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) పెద్ద కుమారుడు మిర్జా సుల్తాన్ అహ్మద్ సాహిబ్ ఇలా రాశారు:

"మా తండ్రి నిరంతరం మతసేవలో నిమగ్నమై ఉండేవారు. కుటుంబ సభ్యులందరికీ వారిపై సంపూర్ణ విశ్వాసం ఉండేది. గ్రామ ప్రజలు కూడా వారిని పూర్తిగా నమ్మేవారు. వారికి వ్యతిరేకంగా ఉన్న బంధువులు కూడా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి న్యాయనిష్ఠపై ఎంతో నమ్మకంను కలిగి ఉండేవారు కాబట్టి, ఏదైనా వివాదం వచ్చినప్పుడు, 'వారు ఏ నిర్ణయం తీసుకున్నా మాకు ఆమోదయోగ్యమే' అని చెప్పేవారు. ప్రతి ఒక్కరూ వారిని విశ్వసనీయుడిగా, సత్య వంతుడిగా భావించేవారు."

**(సీరత్-ఉల్-మహ్దీ, సంపుటి 1, భాగం 1, రివాయత్ 196, పుట 200)**

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఇలా పేర్కొన్నారు:

"హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి తండ్రిగారు, వారు జీవనోపాధి ఎలా సంపాదించుకుంటారో అనే విషయంలో ఆందోళన చెందేవారు. ఎందుకంటే వారికి కుటుంబ ఆస్తుల నిర్వహణపై ఆసక్తి లేకుండెను. అలాగే ఎటువంటి ఉద్యోగం చేయాలనే కోరిక కూడా లేకుండెను. సమీప గ్రామానికి చెందిన ఒక సిక్కు వ్యక్తి ఉండేవాడు. అతని ఇద్దరు కుమారులు తరచూ మా తాతగారిని (హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ గారు ఇక్కడ తన తాతగారిని సందర్భించే వారని చెబుతున్నారు) కలిసేవారు. వారిలో ఒకరు నాకు ఒక సంఘటన వివరించారు.

ఒకసారి పెద్ద మిర్జా సాహిబ్ అతనితో ఇలా అన్నారు: 'నువ్వు గులామ్ అహ్మద్‌ను కలిసి మాట్లాడి రా. అతను నీ వయస్సుకు సమానంగా ఉంటాడు. కుటుంబ ఆస్తుల నిర్వహణలో సహాయం చేయలేకపోతే, నేను అతనికి ఏదైనా ఉద్యోగం ఏర్పాటు చేస్తాను అని చెప్పు.'

ఆ వ్యక్తి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వద్దకు వెళ్లి ఈ సందేశాన్ని అందించాడు. అలాగే, 'మీ తండ్రిగారు మీరు ఏ వృత్తిలోనూ నిమగ్నం కాకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారు. ఆయన ఇలా అంటున్నారు: "నేను మరణించిన తర్వాత, జీవితాంతం తన అన్నయ్య సంపదలో మిగిలిన దానిపైనే ఆధారపడతాడా?" కాబట్టి మీరు ఇష్టపడితే, నేను మీకు ఉద్యోగం ఏర్పాటు చేయగలను' అని చెప్పాడు.

ఇది విన్న హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా సమాధాన మిచ్చారు: 'నా తండ్రిగారు అనవసరంగా ఆందోళన చెందుతున్నారు. నేను సేవ చేయాలని కోరుకున్న ఆ ప్రభువు సేవలో ఇప్పటికే నిమగ్నమై ఉన్నానని ఆయనకు చెప్పు.' మా తాతగారు ప్రాపంచిక సంబంధమైన విషయాల్లో నిమగ్నమైన వ్యక్తి అయినప్పటికీ, ఆ సిక్కు వ్యక్తి చెప్పిన ప్రకారం, అతను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇచ్చిన ఈ సమాధానాన్ని తెలియజేయగానే, ఆయన కొద్దిసేపు మౌనంగా ఉండి ఇలా అన్నారు: 'నా కుమారుడు మిర్జా గులామ్ అహ్మద్ ఈ మాటలు చెప్పి ఉంటే, అది తప్పకుండా సత్యమే. ఎందుకంటే అతను ఎప్పుడూ అసత్యం మాట్లాడడు."

(హాలాతే హజరాకే ముతాల్లిక్ జమాఅత్ అహ్మదియ్యాకో అహమ్ హిదాయత్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 13, పేజి 512-513)

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఇలా వివరిస్తారు:

"1916వ సంవత్సరంలో జరిగిన ఒక సంఘటన నాకు ఎంతో స్పష్టంగా గుర్తుంది; దానిని నేను ఎప్పటికీ మరచిపోలేను. ఆ సమయంలో అఖిల భారత వైఎమ్‌సీ కార్యదర్శి అయిన దివంగత శ్రీ వాల్టర్ గారు, అహ్మదీయా ఉద్యమాన్ని పరిశీలించడానికి ఖాదియాన్‌కు వచ్చారు. అహ్మదీయా ఉద్యమ స్థాపకుని పాత సహచరులలో ఒకరిని కలవాలనే కోరికను ఆయన వ్యక్తం చేశారు. ఆ సమయంలో దివంగత మున్షీ అరోరా సాహిబ్ ఖాదియాన్‌లోనే ఉన్నారు. అందువల్ల ముబారక్ మస్జిద్‌లో శ్రీ వాల్టర్ గారికి ఆయనను పరిచయం చేశారు. కొంత ప్రారంభ సంభాషణ అనంతరం, శ్రీ వాల్టర్ గారు మున్షీ సాహిబ్‌ను ఇలా అడిగారు: 'మిర్జా సాహిబ్ సత్యవంతులని మీరు నమ్మడానికి అత్యంత బలమైన ఆధారం ఏమిటి?' మున్షీ సాహిబ్ ఇలా సమాధానమిచ్చారు: 'నేను పెద్దగా చదువుకున్న వ్యక్తిని కాదు. పాండిత్య పూర్వకమైన అనేక వాదనలు కూడా నాకు తెలియవు. అయితే నన్ను అత్యంతగా ప్రభావితం చేసింది హజ్రత్ సాహిబ్ వారి వ్యక్తిత్వమే. వారి కంటే ఎక్కువ సత్యవంతుడైన, ఎక్కువ నిజాయితీగల, దేవునిపై మరింత దృఢమైన విశ్వాసం కలిగిన వ్యక్తిని నేను ఎప్పుడూ చూడలేదు. వారిని చూసిన ఏ వ్యక్తి కూడా వారు అసత్యవాది అని చెప్పలేడు. నా విషయానికి వస్తే, వారిఇ ముఖకాంతి, వారి వ్యక్తిత్వానికే నేను పూర్తిగా ఆకర్షితుడనయ్యాను. మేధోపరమైన వాదనలు నాకు

ఎక్కువగా తెలియవు.' ఇంత చెప్పగానే, దివంగత మున్షీ సాహిబ్ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి జ్ఞాపకాలతో ఎంతగానో భావోద్వేగానికి లోనై, కన్నీళ్లు పెట్టుకొని అదుపు లేకుండా రోదించడం ప్రారంభించారు. ఆ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న శ్రీ వాల్టర్ గారి పరిస్థితి చూస్తే, వారి ముఖంలోని రంగంతా పూర్తిగా మాయమైనట్లు అనిపించింది. ఆయన ముఖం కొత్తగా ఉతికిన తెల్లని వస్త్రంలా పాలిపోయింది. తర్వాత అతడు తన అహ్మదియ్య మూమెంట్ అనే పుస్తకంలో ఆయన ఈ సంఘటనను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఇలా రాశారు:

'తన సహవాసం ద్వారా ఇటువంటి అనుచరులను తయారు చేసిన వ్యక్తిని కనీసం వంచకుడు లేదా మోసగాడు అని మాత్రం పిలవలేం.'''

**(అస్‌హాబే అహ్మద్ సంపుటి 4, పేజి 94-95)**

హజ్రత్ మియాఁ రహీమ్ బఖ్ష్ సాహిబ్ ఇలా వివరించారు:

"ఒకసారి నాకు ముహమ్మద్ ఇబ్రాహీమ్ అనే ఒక అహ్మదీ వ్యక్తి పరిచయమయ్యాడు. మేము కొద్దిసేపు మాట్లాడుకున్నాము. ఆ సంభాషణ తర్వాత నా మనసు పూర్తిగా నమ్మకానికి వచ్చింది. ఆ రాత్రి నాకు ఒక కల వచ్చింది. ఆ కలలో మేము నలుగురు సోదరులు ఒక పర్వత గుహలో దారి తప్పిపోయాము. బయటకు వచ్చే మార్గం మాకు కనిపించలేదు. నేను ఒక వైపు నుంచి ఎక్కుతూ చివరకు పర్వత శిఖరానికి చేరుకున్నాను. అక్కడ చాలా ఎత్తులో నేలకు ఎంతో పైభాగంలో ఒక రైలు ప్రయాణిస్తున్నట్లు చూశాను. దానిలో ఎలా ఎక్కాలో తెలియక ఆశ్చర్యంతో నిలబడ్డాను. అప్పుడు పై నుంచి ఒక వ్యక్తి నాతో ఇలా అన్నాడు: 'ఆకాశం నుంచి వేలాడుతున్న తాడును గట్టిగా పట్టుకో. అప్పుడు మాత్రమే నీవు పైకి చేరగలవు.' ఈ దృశ్యమంతా నేను కలలో చూశాను. ఉదయం ఇబ్రాహీమ్ సాహిబ్ నా ఇంటికి వచ్చారు. నేను ఆయనకు నా కల గురించి చెప్పాను. అప్పుడు ఆయన పవిత్ర ఖుర్‌ఆన్‌ను తీసి ఈ ఆయత్ అర్థాన్ని వివరించారు: **వఅతసిము బి హబ్‌లిల్లాహి** అనగా 'అల్లాహ్ తాడును గట్టిగా పట్టుకోండి.' (ఆలే ఇమ్రాన్:104) ఆ వెంటనే నేను బైఅత్ చేయడానికి ఒక ఉత్తరం రాశాను. దానికి సమాధానంగా నా బైఅత్ ఆమోదించ బడిందని, అయితే నేను వ్యక్తిగతంగా ఖాదియాన్‌కు రావాలని తెలియజేశారు. ఆ సమాధానం నాకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారి నుండి లేదా వారి కార్యదర్శి లేదా మరెవరో రాసినదైనా వచ్చింది. అందువల్ల నేను ఆలస్యం చేయకుండా ఖాదియాన్ ప్రయాణానికి సిద్ధమయ్యాను.

అమృత్‌సర్ రైల్వే స్టేషన్‌లో బటాలాకు వెళ్లే రైలులో ఎక్కినప్పుడు, నా కంపార్ట్ మెంట్‌లో ఇద్దరు లేదా ముగ్గురు సిక్కులు ఉన్నారు. వారు నన్ను అడిగారు: 'మీరు ఎక్కడికి వెళుతున్నారు?' నేను, 'ఖాదియాన్‌కు' అని చెప్పాను. వారు మళ్లీ అడిగారు: 'మిర్జా ఉన్న ఖాదియాన్‌కా?' నేను, 'అవును' అన్నాను. తరువాత వారిని అడిగాను: 'అయితే నిజంగా వారు ఎలాంటి వ్యక్తి?' ఈ ప్రశ్నను నేను సందేహంతో అడగలేదు. ఎందుకంటే నాకు అప్పటికే ఆ కల వచ్చింది. అయితే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గురించి ఇతరులు ఏమనుకుంటున్నారో వినాలని మాత్రమే అనుకున్నాను. అప్పుడు వారు ఇలా అన్నారు: 'ఆయన చాలా ప్రసిద్ధుడు. ఆయన తానే దేవుడినని చెప్పుకుంటాడు.' ఇది సిక్కుల అవగాహన మాత్రమే. వారి ఆలోచనా విధానం ప్రకారం వారు అలా భావించారు. వాస్తవానికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) చేసిన వాగ్ధానం' తాను దైవ ప్రకటనతో పంపబడిన వాడినని, ప్రజలను సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వైపు తిరిగి పిలవడానికి పంపబడిన వాడినని'. ఏమైనప్పటికీ, ఆయన ఇలా కొనసాగించారు: 'వినోదం కోసమే, నేను అప్పటికే బైఅత్ చేసినప్పటికీ, ఒక చిలిపి ఆలోచనతో వారితో ఇలా అన్నాను: "నాకు మిర్జా సాహిబ్ బాగా తెలుసు. సియాల్కోట్‌లో వారు, నా తండ్రి ఇద్దరూ ఒకే ఉద్యోగంలో ఉండేవారు. ఇద్దరూ కలిసి గంజాయి తాగేవారు." నా విశ్వాసం అప్పుడే ప్రారంభ దశలో ఉండటంతో సరదాగా అలా చెప్పాను. అయితే ఆ సిక్కులు వెంటనే నాతో ఇలా అన్నారు: 'మియాఁ! అలాంటి మాట ఎప్పుడూ అనకండి. వారు అత్యంత నిరాడంబరుడు, పవిత్రుడు. సంపూర్ణ సత్యనిష్ఠ పరుడు, విశ్వసనీయత కలిగిన వ్యక్తి. ఆయన నిజాయితీ ఎంత ప్రసిద్ధమైందంటే, అది మా ప్రాంతంలో ఒక సామెతగా మారిపోయింది. ఎవరైనా నిజం మాట్లాడితే మా ప్రజలు ఇలా అంటారు: "నువ్వేమైనా మిర్జా గులామ్ ముర్తజా కుమారుడివా?" అంటే వారి సత్యనిష్ఠ, నిజాయితీ మా మధ్య సామెతగా మారిపోయింది. చిన్నప్పుడు ఆయన మాతో కలిసి ఆడుకునేవారు. పుస్తకాల నుంచి మాకు చదివి వినిపించేవారు. ఆయన ఖాదియాన్ నాయకుడి కుమారుడు అంటే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఖాదియాన్ ప్రధానుడి కుమారుడు. అందువల్ల మేము ఆయనను ఎంతో గౌరవించేవాళ్లం. కాలక్రమేణా ఆయనలో మార్పు వచ్చింది. ఒక దశలో ఆయన పూర్తిగా ఇంట్లోనే ఉండసాగారు; బయటకు రావడం మానేశారు. అంటే ఆయన ఏకాంత జీవితాన్ని స్వీకరించారు. మా వంటి మూఢనమ్మకాలున్న ప్రజలు ఆయన ఇంట్లో కూర్చొని ఏదో మాయాజాలం చేస్తున్నారని అనుకునేవాళ్లం. మతపరమైన అవగాహన లేని మాకు ఆయన ఏదో మంత్రతంత్రాలు చేస్తున్నట్లు అనిపించేది. అంతేకాక, "ఖాదియాన్ చుట్టూ నాలుగు మైళ్ల పరిధిలో ఆయన తన మంత్రాన్ని వ్యాపింపజేశాడు" అని కూడా చెప్పేవాళ్లం. దీని అర్థం, ఆయన తన సత్యాన్ని ప్రజలందరికీ బలంగా నిరూపించి వారి హృదయాలను గెలుచుకున్నారు. ఏ మతానికి చెందిన వ్యక్తి అయినా సరే, ఆయన వద్దకు వచ్చినా, వారి స్వంత మతగ్రంథాల ఆధారంగానే తన సత్యాన్ని నిరూపించి, వారి మతంలోని పొరపాట్లను చూపించేవారు. వారు తాను పరలోకం నుండి పంపబడ్డానని కూడా చెబుతారు.' ఇవే ఆ సిక్కులు నాకు చెప్పిన మాటలు. కాబట్టి, ఇవన్నీ విన్న తరువాత ఆయన ఇలా చెప్పారు:

"నేను ఖాదియాన్‌లోని అతిథి గృహానికి చేరుకున్నప్పుడు అక్కడ ముగ్గురు లేదా నలుగురు యువకులు ఉన్నారు. అప్పుడు నేను మనసులో అనుకున్నాను: 'వీరిని ఒకసారి పరీక్షించి చూద్దాం. నేను సరైన నిర్ణయం తీసుకున్నానో లేదో తెలుసుకుందాం.' అందుకే నేను ఆ యువకులతో కొంత కఠినంగా, పరుషంగా మాట్లాడాను. అయితే, నా రూఢి ప్రవర్తనకు ప్రతిగా వారు ఎంతో మృదువుగా, అత్యుత్తమ మర్యాదతో మాత్రమే సమాధానం ఇచ్చారు. నేను ఉద్దేశపూర్వకంగానే అలా ప్రవర్తించాను, ఎందుకంటే వారి నైతిక శిక్షణ ఎలా ఉందో గమనించాలనుకున్నాను. నా కఠినత్వానికి ప్రతిగా వారు ఎంతో సౌమ్యంగా, వినయంగా ప్రవర్తించారు. తర్వాత నేను వారితో, 'నేను మిర్జా సాహిబ్‌ను కలవాలనుకుంటున్నాను' అని చెప్పాను. వారు, 'హుజూర్ (అ) ఇప్పుడే నడకకు వెళ్లారు. ఇప్పుడు వారిని కలవడం కష్టమే' అని సమాధానం ఇచ్చారు. "నేను ఖాదియాన్ వీధుల్లో తిరుగుతూ ఉండగా నా హృదయం అస్థిరంగా మారింది. తీవ్రమైన ఎండ కారణంగా ఇక వెనుదిరిగి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాను." ఆ సమయంలో ఆయన విశ్వాసం ఇంకా పూర్తిగా దృఢపడలేదు. మార్గమధ్యంలో ఆయనకు ఒక అరబ్ వ్యక్తి ఎదురయ్యాడు. అతను ఇలా అన్నాడు: 'సోదరా, నువ్వు ఖాదియాన్ వరకు వచ్చావు కదా! మరి వెళ్లే ముందు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)ను తప్పకుండా దర్శించు. ఇంత దూరం వచ్చాక వారిని కలిసిన తరువాతే తిరిగి వెళ్లు. ఈ అవకాశం మళ్లీ రాదు. తరువాత మరెందరో వస్తారు, కానీ ఈ ప్రత్యక్ష సన్నిధి మళ్లీ లభించదు.'

(అంటే, "ఇప్పుడు అవకాశం ఉంది, వెళ్లి వారిని కలవండి.")

"కానీ నేను అతని మాటలను పట్టించుకోలేదు. బండివాడితో వెంటనే బయలు దేరమని చెప్పాను. తీవ్రమైన ఎండ వల్ల నేను బాగా అలసిపోయాను. అంతేకాక, కలిసే అవకాశం కూడా రాలేదు. అందువల్ల తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నాను." ఆయన ఇంకా ఇలా చెప్పారు: "అప్పుడే అజాన్ వినిపించింది. నేను మనసులో, 'నమాజ్ చేసి తర్వాత బయలుదేరుదాం' అని అనుకున్నాను. అందుకే మస్జిద్ వైపు తిరిగి వెళ్లాను. ఇంతకు ముందు నన్ను వెళ్లవద్దని కోరిన అదే అరబ్ వ్యక్తి మళ్లీ నా దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు: 'సోదరా, నువ్వు వెళ్లిపోతానని చెప్పిన క్షణం నుంచే నేను సజ్దాలో పడి అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను. నీవు ఇక్కడే ఉండి, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)ను దర్శించే భాగ్యం పొందాలని నేను ప్రార్థించాను.' ఆ అరబ్ వ్యక్తి యొక్క నిష్కపటత ఎంత గొప్పదో దీని ద్వారా తెలుస్తుంది. అతను ఇలా భావించాడు: "ఈ వ్యక్తి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఇప్పుడు చేయగలిగిన ఒక్కటే మార్గం అల్లాహ్ సన్నిధిలో సజ్దాలో పడి ప్రార్థించడం." అతను మరలా చెప్పాడు: "ఆ క్షణం నుంచే నేను నిరంతరం సజ్దాలో ఉండి నీ కోసం ప్రార్థిస్తున్నాను, నీవు వెళ్లే ముందు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)ను తప్పకుండా దర్శించగలగాలని."ఆయన తరువాత ఇలా చెబుతారు:

"నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)ను చూశాను. వారు

| **అహాదీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

| **అహాదీస్ బోధనలు** | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణవేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb***

వచ్చి సభలో కూర్చున్నారు. నేను వారి ఎదుట నిలబడ్డాను. నా గడ్డం, తల, మీసం అన్నీ పూర్తిగా గీయించుకున్నాను. (ఆ రోజుల్లో కూడా అలాంటి ఫ్యాషన్‌ను అనుసరించే వారిలో అది ఒక ఆచారం.) హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తలను వంచుకుని కూర్చున్నారు. నేను మనసులో అనుకున్నాను: 'ఈ వ్యక్తి ముఖాన్ని చూసే వరకు నాకు పూర్తి నిశ్చయం కలగదు.' నేను ఉత్తరం ద్వారా బైఅత్ చేసినప్పటికీ, నా హృదయంలో ఇంకా సంపూర్ణ విశ్వాసం స్థిరపడలేదు. (ఆయన వర్ణనను బట్టి చూస్తే, నిజంగానే ఇంకా స్థిరపడలేదు.) కొద్దిసేపటి తరువాత హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తన ముఖాన్ని పైకెత్తి నన్ను చూశారు. ఆ క్షణంలోనే నా హృదయం ఇలా ప్రకటించింది: 'వారు సత్యవంతులు.' వారి ముఖాన్ని చూసిన వెంటనే నా హృదయం లోపల నుంచి ఒక స్వరం వినిపించింది: 'ఈయన సత్యవంతుడు, నిజమైన వాడు.' కొద్దిసేపటి తరువాత వారు మళ్లీ తలను పైకెత్తారు. అప్పుడు నేను, ' (ఆమన్నా) నేను విశ్వసించాను, (వ సద్దఖ్నా) మీ సత్యాన్ని ధృవీకరిస్తున్నాను. మీరు సత్యవంతులు' అని అన్నాను. మూడవసారి వారు నన్ను చూసినప్పుడు, నేను పూర్తిగా వారికి లొంగిపోయినట్లుగా అనిపించింది. తరువాత సమూహ ప్రార్థన ప్రారంభమైంది. నమాజు ముగిసిన తరువాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం లోపలికి వెళ్లబోతుండగా, తలుపు దగ్గర నిలబడి ఉన్న ఒక వ్యక్తి, 'హుజూర్! దయచేసి నా కోసం ప్రార్థించండి' అని వినతి చేశాడు. దానికి వారు ఇలా సమాధాన మిచ్చారు: 'నీవు ఇప్పటికే నా బైఅత్‌లో ఉన్నావు. నేను నా శత్రువుల కోసం కూడా ప్రార్థిస్తాను."**(రివాయాత్ అషాబ్-ఎ-అహ్మద్, భాగం 4, పుటలు 362--363)**

హజ్రత్ ఖలీఫా నిజాముద్దీన్ సాహిబ్ (రజియల్లాహు అన్హు) ఇలా వివరిస్తారు:

"నేను ఉద్యోగం కోసం సియాల్కోట్ నుండి సింధ్‌లోని షికార్‌పూర్‌కు వెళ్లాను. అక్కడ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)కు వ్యతిరేకంగా ఎన్నో విషయాలు విన్నాను. అమృత్‌సర్‌లో నాకు స్నేహితులు ఉండటంతో, షికార్‌పూర్ నుండి అక్కడికి వెళ్లాను. అమృత్‌సర్ నుండి సియాల్కోట్‌కు వెళ్లాలని అనుకున్నాను. కానీ నేను గాఢనిద్రలో ఉండటంతో, సియాల్కోట్‌కు వెళ్లే రెండు రైళ్లను కోల్పోయాను. మేల్కొన్న తరువాత రైళ్లు అప్పటికే వెళ్లిపోయాయని తెలిసింది. వెంటనే నా మనసులో ఒక ఆలోచన వచ్చింది. మిర్జా సాహిబ్ వారి ఊరు సమీపంలోనే ఉంది కదా. కనీసం ఆయనను ఒకసారి చూసి రావాలి."ఆయన ఇంకా ఇలా తెలిపారు: "తర్వాత బటాలాకు వెళ్లే తదుపరి రైలు ఎప్పుడు ఉందని అడిగాను. అరగంటలో బయలు దేరుతుందని చెప్పారు. టికెట్ కొనుకుని బటాలాకు చేరుకున్నాను. అక్కడి నుంచి నడుచుకుంటూ ఖాదియాన్‌కు వెళ్లాను. నేను అక్కడ అసర్ నమాజు సమయానికి చేరుకుని, హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీమ్ సాహిబ్ (ర.అ.)ను కలిశాను." సియాల్కోట్ రోజుల నుంచే ఆయనకు మౌల్వీ అబ్దుల్ కరీమ్ సాహిబ్ (రజి) పరిచయం ఉండేది, ఎందుకంటే ఆయన కూడా అక్కడి వారే.

ఆయన ఇలా చెబుతారు: "నన్ను చూసి ఆయన ఎంతో సంతోషించారు. మేము కలిసి అసర్ నమాజు చేశాము. మరుసటి ఉదయం మౌల్వీ అబ్దుల్ కరీమ్ సాహిబ్ (రజి) నా గురించి హజ్రత్ మసీహ్‌మౌవూద్ (అ.స.)కు తెలియజేశారు. తరువాత మసీదు కిటికీలోని చిన్న తెరువు దగ్గర హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నా బైఅత్‌ను స్వీకరించారు."

ఆయన ఇంకా ఇలా తెలిపారు: "హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ముఖాన్ని ఒక్కసారి దర్శించగానే, నా హృదయానికి సంపూర్ణ నిశ్చయం కలిగింది. ఈ ప్రపంచమంతా అసత్యమై ఉండ వచ్చు; కానీ ఈ ముఖం మాత్రం అసత్యవాది ముఖం కావడం అసాధ్యం. హుజూర్ (అ) ముఖకాంతిలో ఒక విశేషమైన ఆకర్షణ ఉండేది. వారి ముఖం నుండి వెలువడే దివ్యప్రకాశం హృదయాలను ఆకర్షించేది."

(రివాయాత్ అషాబ్-ఎ-అహ్మద్, భాగం 4, పుట 365)

అదేవిధంగా, హజ్రత్ హకీమ్ అబ్దుర్ రహ్మాన్ సాహిబ్ (రజి) ఇలా వివరిస్తారు: "నా గౌరవనీయ తండ్రిగారు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ.స.) బైఅత్ చేసిన తరువాత, లయల్పూర్ జిల్లాలోని గోజ్రా పోస్టాఫీసు సమీపంలోని చక్ నంబర్ 276కు వెళ్లారు. అక్కడ ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. ఆ ప్రాంత ప్రజలు ఆయనను తమ ఇమామ్‌గా నియమించారు. ఆయన పవిత్ర ఖుర్ఆన్ బోధించడం ప్రారంభించినప్పుడు, ఈసా (అలైహిస్సలాం) మరణం గురించి చర్చ వచ్చింది. అప్పుడు ఆయన ఈసా (అ.స.) మరణానికి సంబంధించిన విషయాన్ని ఎంతో విపులంగా వివరించారు. దాంతో ప్రజలు ఆశ్చర్యపోయారు.

ఆయన ఇలా చెప్పారు:"వజీర్ దిన్ అనే ఒక వ్యక్తి ఉండేవారు. ఆయన గ్రామానికి స్థానిక ప్రతినిధిగా ఉండేవారు. ఒక రోజు వజీర్ దిన్ హకీమ్ సాహిబ్‌తో ఇలా అన్నారు: 'నాకు ఒక పెద్ద వంట పాత్ర (డేగ్) కావాలి. ఆ రోజుల్లో ప్రభావశీలులు పేదలకు అన్నదానం చేయడానికి లేదా గ్రామ పెద్దలు నిర్వహించే పెద్ద సభలు, విందుల కోసం ఇలాంటి పెద్ద పాత్రలను ఉంచుకునేవారు. మంచి నాణ్యత గల వంట పాత్రలు గుజ్రాన్‌వాలాలో లభిస్తాయి. నాతో అక్కడికి వచ్చి ఒకటి కొనుగోలు చేద్దాం.' అప్పుడు నేను ఆయనతో, 'మీకు నిజంగా మంచి నాణ్యత గల పెద్ద వంట పాత్ర కావాలంటే, గుజ్రాన్‌వాలా కాకుండా బటాలాకు వెళ్దాం. అక్కడ ఇంకా మెరుగైనవి తయారు చేస్తారు' అని చెప్పాను. ''వేము బటాలాకు చేరుకున్న తరువాత, నేను చౌధరీ వజీర్ దిన్‌తో ఇలా అన్నాను: 'మిర్జా సాహిబ్ సమీపంలోని ఖాదియాన్‌లో నివసిస్తున్నారు. వారు సత్యవంతుడు. నేను ఇప్పటికే ఆయన బైఅత్ (ఆధ్యాత్మిక విధేయత ప్రమాణం) చేశాను. మీరు కూడా నాతో రండి.' దీనికి చౌధరీ సాహిబ్ ఇలా అన్నారు: 'ఆయన నిజంగా సత్యవంతుడేనని నేను సాక్ష్యమిస్తున్నాను.' చౌధరీ సాహిబ్‌కు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గురించి ముందే తెలుసు. ఆయన ఇలా చెప్పారు: 'సియాల్కోట్‌లో మిర్జా సాహిబ్, నేను ఇద్దరం కలిసి ఉద్యోగం చేసేవాళ్లం. నేను భూముల రిజిస్ట్రార్‌గా పనిచేసేవాడిని, వారు ఆ కార్యాలయంలో పనిచేసేవారు.'

హకీమ్ సాహిబ్, చౌధరీ సాహిబ్ ఇద్దరూ వంట పాత్రలు కొనడానికి వెళ్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గురించి మాట్లాడుకున్నారు. అప్పుడు చౌధరీ వజీర్ దిన్ ఇలా అన్నారు: "వారు తప్పకుండా సత్యవంతుడే. ఎందుకంటే మేము కార్యాలయంలో కలిసి పనిచేసిన రోజుల్లో నేను వారిని స్వయంగా చూశాను. వారు ఎప్పుడూ లంచం తీసుకోలేదు; ఒక్కసారి కూడా అబద్ధం చెప్పలేదు. వారు అత్యంత భక్తిపరుడు, నీతిమంతుడు. అలాంటి వ్యక్తి ఎన్నటికీ అసత్యమైన హక్కును ప్రకటించడు. (హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం యౌవన దశను నేను స్వయంగా చూశాను. అలాంటి వ్యక్తి అసత్య వాదన చేయడం అసంభవం.) రండి, నేను కూడా మీతో వస్తాను." అలా చౌధరీ సాహిబ్ వెంటనే ఖాదియాన్‌కు వెళ్లి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) బైఅత్ చేశారు.

(రివాయాత్ అష్హాబ్-ఏ-అహ్మద్, సంపుటి 4, పుటలు 373-374)

మియాం ఫిరోజ్ దిన్ సాహిబ్ ఇలా తెలిపారు: "మా తాతగారి పేరు మియాం నిజామ్ దిన్. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఉద్యోగ నిమిత్తం సియాల్కోట్‌కు వచ్చినప్పుడు, మా తాతగారు సాలు గుజర్ ప్రాంతంలో వారి కోసం ఒక అద్దె ఇంటిని ఏర్పాటు చేశారు. అలాగే, మా తాతగారే వారి కోసం ఆరు మాష్‌ల బరువున్న ఒక బంగారు ఉంగరాన్ని తయారు చేసి, దానిని వారి ఇంటికి పంపించారు. ఈ విధంగా మా తాతగారికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)తో ఎంతో సన్నిహిత సంబంధం ఏర్పడింది. "తర్వాత హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తానే మసీహ్‌నని ప్రకటించినప్పుడు, కొంతకాలం తరువాత మా తాతగారు వారి బైఅత్ చేశారు. అనంతరం మా కుటుంబ సభ్యులందరితో ఇలా అన్నారు: 'వారు ఇక్కడ ఉద్యోగం చేసిన రోజుల నుంచే నాకు తెలుసు. కాబట్టి మీరందరూ వెంటనే వారి బైఅత్ చేయండి. ఇవి అబద్ధకుడి ముఖకవళికలు కావు.' అలా మా కుటుంబమంతా 1892 సంవత్సరంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) బైఅత్ చేసింది." (అష్హాబ్-ఏ-అహ్మద్, సంపుటి 4, పుట 374)

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజియల్లాహు అన్హు) ఇలా తెలిపారు:

"మున్షీ అబ్దుల్ అజీజ్ సాహిబ్ ఔజల్వీ ఇలా చెప్పారు: 'సుమారు 1890 ప్రాంతంలో నేను గుర్దాస్‌పూర్ తహసీల్‌లోని జగత్‌పూర్ కోహ్లియాన్ గ్రామంలో భూముల రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నాను. 1891లో ఎంతో ప్రయత్నం చేసి గుర్దాస్పూర్ తహసీల్‌లోని సిఖ్వాన్ గ్రామానికి బదిలీ పొందాను. ఆ సమయంలో నేను అహ్మదీను కాదు. అయితే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గురించి విని ఉండేవాడిని. నాకు వారిపై వ్యతిరేకత ఏమీ లేదు. కానీ ఒక విషయం మాత్రం నన్ను వెనక్కి నిలిపేది. అదేంటంటే, మత పండితులందరూ వారికి వ్యతిరేకంగా ఉండటం.'"

సిఖ్వాన్‌కు చేరుకున్న తర్వాత, నేను మియాం జమాల్ దిన్ సాహిబ్, ఇమామ్ దిన్ సాహిబ్ మరియు ఖైర్ దిన్ సాహిబ్‌లతో పరిచయం ఏర్పరచుకున్నాను. వారు

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | **"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు."** **(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |
|---|---|

దుఆ ఆశించువారు: ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***




నాకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అస) గారి ఇజాలా-ఏ-ఔహామ్ అనే గ్రంథాన్ని చదవడానికి ఇచ్చారు. నమాజు చేసిన తర్వాత నేను ఆ పుస్తకాన్ని చదవడం ప్రారంభించాను. నేను దానిని కొనసాగిస్తూ చదువుతున్న కొద్దీ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అస) గారి సత్యత నా హృదయంలో గట్టిగా కొట్టిన మేకువలె స్థిరపడి పోయింది, నా సందేహాలన్నీ తొలగి పోయాయి. కొన్ని రోజుల తర్వాత, నేను మియాఁ ఖైర్ దిన్ గారితో కలిసి ఖాదియాన్‌కు ప్రయాణించాను. అక్కడ గోల్ కమ్రా గుండ్రని గది సమీపంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అస) గారిని మొదటిసారి దర్శించుకునే అవకాశం నాకు లభించింది. నేను మియాఁ ఖైర్ దిన్ సాహిబ్‌తో ఇలా అన్నాను: "ఇది అబద్ధాలకోరు వ్యక్తి ముఖం కాదు." ఆ తర్వాత నేను బైఅత్ (ప్రతిజ్ఞ) చేశాను.'"

(సీరత్-ఉల్-మహ్దీ, భాగం 1, భాగం 3, పుట 617, వృత్తాంతం 659)

అదేవిధంగా, హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) హజ్రత్ చౌదరి జఫ్రుల్లా ఖాన్ సాహిబ్ గురించి మరొక వృత్తాంతాన్ని ఇలా వివరించారు:

"గౌరవనీయులైన సర్ చౌదరి ముహమ్మద్ జఫ్రుల్లా ఖాన్ సాహిబ్ నాకు లిఖిత పూర్వకంగా ఇలా తెలిపారు: 'లాహోర్‌లో నేను మొదటిసారిగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అస) గారిని దర్శించుకునే అవకాశం పొందినప్పుడు, వారి విశ్వాసాలకు సంబంధించి నా హృదయంలో ఎలాంటి విమర్శ లేదా అభ్యంతరం లేదు. ఆ క్షణంలోనే నా హృదయంలో స్థిరపడిన భావన ఒక్కటే. ఈ వ్యక్తి సత్యవంతుడు, మరియు వారు చెప్పేది అంతా సత్యమే. అంతేకాకుండా, అల్లాహ్ తఆలా నా హృదయంలో వారి పట్ల అలాంటి ప్రేమను నింపాడు, అది ఒక్కటే నాకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి సత్యతకు ప్రాథమిక సాక్ష్యంగా మారింది. ఆ సమయంలో నేను చిన్న బాలుడినైనా, ఆ రోజు నుండి ఇప్పటి వరకు, మరే ఇతర సాక్ష్యం అవసరమని నాకు ఎప్పుడూ అనిపించలేదు.

"'ఆ తర్వాత, నా విశ్వాసాన్ని బలపరిచే సాధనాలుగా అనేక సంఘటనలు వరుసగా జరుగుతూ వచ్చాయి. అయినప్పటికీ, నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అస) వారిని వారి పవిత్ర ముఖాన్ని దర్శించడం ద్వారానే స్వీకరించాను. ఆ మొదటి భావనే నేటికీ వారి వాగ్దానాల సత్యతకు నాకు అతి గొప్ప సాక్ష్యంగా ఉంది. ఈ దృష్టిలో, నేను వారిని మొదటిసారి చూసిన అదే రోజు 3 సెప్టెంబర్ 1904 నుండి నన్ను నేను అహ్మదీగా భావిస్తున్నాను.'"

(సీరత్-ఉల్-మహ్దీ, భాగం 2, భాగం 4, పుట 37, వృత్తాంతం 1036)

అదేవిధంగా, హజ్రత్ మియాఁ సదర్ దిన్ సాహిబ్ ఇలా పేర్కొన్నారు:

"నేను బైఅత్ చేసినప్పుడు, నా తండ్రితో ఇలా అన్నాను: 'ప్రజలు ఇంత పెద్ద సంఖ్యలో ఖాదియాన్‌కు ఎందుకు వస్తున్నారో మీకు తెలుసా?' వారు సమాధానమిచ్చారు: 'నాకు తెలియదు.' నేను అన్నాను: 'మిర్జా సాహిబ్ తానే వాగ్దత్త మెస్సీయా అని చెబుతున్నారు.' నా తండ్రి ఇలా అన్నారు: 'ఈ మాట నిజమే అయి ఉండాలి. నేను ఈ వ్యక్తిని చిన్నప్పటి నుండి గమనిస్తున్నాను; ఆయన ఎప్పుడూ అబద్ధం చెప్పరు.'"(రవాయత్ అషాబ్-ఏ-అహ్మద్, భాగం 4, పుటలు 93-94)

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అస) గారు ఇలా పేర్కొన్నారు:

"ఇప్పుడు గమనించండి, దేవుడు మీపై తన సాక్ష్యాన్ని ఏ విధంగా సంపూర్ణం చేశాడో. నా వాగ్దానాలకు మద్దతుగా వేలాది వాదనలు మరియు సాక్ష్యాలను స్థాపించడం ద్వారా, మిమ్మల్ని ఈ జమాఅత్ వైపు పిలిచే వ్యక్తికి ఎంత స్థాయి అవగాహన మరియు జ్ఞానం ఉందో, మరియు అతను ఎన్ని సాక్ష్యాలను సమర్పిస్తున్నాడో ఆలోచించే అవకాశాన్ని ఆయన మీకు ఇచ్చాడు. అంతేకాకుండా, నా గత జీవితంపై ఎటువంటి లోపం, తప్పుడు ఆరోపణ, అబద్ధం లేదా మోసం అనే ఆరోపణను మీరు చేయలేరు. తద్వారా గతంలో అబద్ధాలు మరియు అపవాదులకు అలవాటు పడిన వ్యక్తి చెప్పిన మరో అబద్ధమేమో అని మీరు భావించలేరు. మీలో ఎవరు నా గత జీవితంలోని ఏ అంశాన్ని విమర్శించగలరు? కాబట్టి, ఇది అల్లాహ్ యొక్క కృప ఆయన మొదటి నుంచే నన్ను నీతిమార్గంపై స్థిరంగా ఉంచాడు. ఆలోచించే వారికి ఇదే ఒక సాక్ష్యం."

(తజ్కిరతు షహాదతైన్, రూహానీ ఖజాయిన్, భాగం 20, పుట 64)

మనలను ఉపదేశిస్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అస) గారు ఇలా పేర్కొన్నారు: "గుర్తుంచుకోండి, సత్యం ఒక వ్యక్తిపై సంపూర్ణ ప్రభావం చూపినప్పుడు, అది ఒక వెలుగుగా మారుతుంది. ఆ వెలుగు దానిని స్వీకరించిన వ్యక్తికి ప్రతి చీకటిలో మార్గనిర్దేశం చేస్తుంది మరియు కష్టకాలాల్లో అతనిని రక్షిస్తుంది."

(మల్ఫూజాత్, భాగం 3, పుట 157)

అల్లాహ్ తఆలా మనకు ఈ వాస్తవాన్ని అర్థం చేసుకునే సామర్థ్యాన్ని ప్రసాదించుగాక. మనలను సత్యంపై స్థిరంగా ఉంచుగాక మరియు ఎల్లప్పుడూ సత్యవంతత యొక్క అత్యున్నత ప్రమాణాలకు అనుగుణంగా ప్రవర్తించేలా అనుగ్రహించుగాక. ఆమీన్.

**(12వ పేజీ తరువాత చదువుము)**



దేవుని ప్రేమ చల్లబడిపోయింది. నేడు నా కాలంలో కూడ ఇదే పరిస్థితి గలదు. కావున నిజాయితి మరియు విశ్వాస కాలం తిరిగి రప్పించబడుటకు, హృదయాలలో దైవభీతి జనింపజేయుటకు నేను పంపబడ్డాను. కావున ఈ కార్యములే నా అవతరణ యొక్క ప్రధాన అంశాలు. చాలా దూరమైన తరువాత మరల ఆకాశం భూమండలానికి దగ్గరికి చేయబడుతుందని నాకు చెప్పడం జరిగింది.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మరల ఇలా తెలిపారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం బైఅత్ చేశామని ప్రకటించుకునే మనం, ఎంత వరకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి అవతరణ ఉద్దేశాన్ని నెరవేర్చుతున్నామని మనం ఆత్మ విమర్శన చేసుకోవాలి. నేను విశ్వాసాన్ని పటిష్టం చేయుటకు వచ్చాను అని, వారిలో పటిష్టతను ఏర్పర్చుటకు వచ్చాను అని హుజూర్ అలైహిస్సలాం పేర్కొన్నారు. కావున మన విశ్వాసం పటిష్టత వైపు మరలుచున్నదా? అని మనం పరిశీలించుకోవలసిన అవసరం ఉన్నది. మరల ఇలా తెలిపారు. అల్లాహ్ తాలా ఉనికి నిరూపించబడడం ద్వారా, అల్లాహ్ తాలాపై సంపూర్ణ విశ్వాసంను కల్గియుండడం ద్వారా విశ్వాసం పటిష్టతకు చేరుకుంటుంది. మరల ఇలా తెలిపారు. నేటి ప్రపంచంలో అల్లాహ్ తాలాపై ఉండే నమ్మకం కంటే ప్రపంచంపై మరియు ప్రాపంచిక సౌకర్యాలపై ఎక్కువ నమ్మకం ఉన్నది. అల్లాహ్ తాలా వైపు దృష్టిని కేంద్రీకరించుటకు బదులుగా, ప్రపంచం వైపు దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. అల్లాహ్ తాలాపై ఉండవలసిన నమ్మకం నామ మాత్రముగా మిగిలిపోయింది. ప్రపంచీకులకు, ప్రపంచ సాధనాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఒకవేళ మనం మన చుట్టు ప్రక్కల చూసుకున్నచో ఈ పరిస్థితులే మనకు కనిపిస్తుంటాయి. కాని మనం మన చుట్టు ప్రక్కల కేవలం ప్రపంచీకులు అల్లాహ్ తాలాకు కాకుండా ప్రపంచానికే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారా? లేదా? అని తెలుసుకోవడానికి చూడకూడదు. నిజానికి మనం ప్రాపంచిక సాధనాలపై ఎక్కువ మక్కువను పెంచుకుంటున్నామా? లేక అల్లాహ్ తాలాపై ఎక్కువ మక్కువను పెంచుకుంటున్నామా? అని మన ఆత్మ పరిశీలన చేసుకోవడానికి చూడాలి.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా తెలిపారు: ఒకవేళ మనం బైఅత్ చేసిన తరువాత కూడ అల్లాహ్ తాలాను గుర్తించవలసిన విధముగా మనం అల్లాహ్‌ను గుర్తించనిచో, బైఅత్ చేయడమనేది మనకు ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చదు. మనం తమను తాము అహ్మదీయులమని చెప్పుకోవడంలో ఎలాంటి విలువ ఉండదు. ఒకవేళ నేడు మనం మన ఈ ప్రాపంచిక నాయకులను ఆనందింపజేసే పనిలో ఉన్నచో, ఈ చింతన అల్లాహ్ తాలాను ఆనందింపజేయడం కంటె ఎక్కువ ఉన్నచో మనం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి అవతరణ ఉద్దేశాన్ని నెరవేర్చడం లేదని అర్థం. మనం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో చేసిన బైఅత్ వాగ్దానమును నెరవేర్చడం లేదని అర్థం. ఒకవేళ మనం ప్రాపంచిక ఆచార వ్యవహారలకు మన ధర్మంపై ప్రాధాన్యతను కల్పించుచున్నచో మనం అహ్మదీయులము అని పిలిపించుకోవడం కేవలం నామ మాత్రమే అని అర్థం.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా తెలిపారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు: మాకు అల్లాహ్ తాలా అస్థిత్వంపై నమ్మకం ఉన్నదని, మేము అల్లాహ్ తాలాను అందరి కంటే గొప్ప వాడిగా విశ్వసించుతామని, అల్లాహ్ తాలా యొక్క అభిమానం ఇతర అభిమానాల అన్నింటిపై అధిక్యతను కల్గియున్నదని నోటి ద్వార వాగ్దానం చేసినప్పటికి నిజానికి మనస్సులో మాత్రం ప్రాపంచిక అభిమానమే అధికముగా ఉన్నది. ముసల్మానులు, ముస్లిమేతరులు ప్రతి ఒక్కరు ప్రాపంచిక అభిమానంలోనే మునిగి ఉన్నట్లుగా మనకు నలువైపుల నుండి కనిపిస్తుంది. ప్రాపంచిక చెడు వ్యసనాలు, నిర్లజ్జ వంటివి అల్లాహ్ స్మరణను దూరం చేశాయి. ఐదు పర్యాయములు నమాజ్ సల్పమని ముసల్మానులను ఆదేశించడమైనది. అల్లాహ్ ప్రీతి, అతనిపై గల అభిమానంతో నమాజ్ సల్పమని ఆదేశించడమైనది. కాని ఆచరణ విషయానికి వచ్చినచో అందుకు పూర్తి భిన్నమైన వ్యవహారమున్నది. ఒక అహ్మదీయులు ఈ కోణంలో ఇతరును పరిశీలించి చూసినచో , మనం మన నమాజ్‌లను అల్లాహ్ తాలా ఆదేశానికి అనుగుణముగా చదువుచున్నామా? లేదా?, మనం అల్లాహ్ తాలా ఆదేశానికి అనుగుణముగా మనం మన ప్రార్థనలను చేయుచున్నామా? లేదా? అని ముందుగా పరిశీలించుకో వలసిన అవసరం ఉన్నది. ఒకవేళ అలా లేనిచో అల్లాహ్‌తాలాపై విశ్వాసంను పటిష్టం చేయుటకు వచ్చానని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చేసిన వాగ్దానంను మనం తిరస్కరించిన వారము అవుతాము. హుజూర్ అలైహిస్సలాం అవతరణ యొక్క ఉద్దేశం సత్యకాలమును మరల స్థాపించడం. హుజూర్ అలైహిస్సలాం గారి అవతరణ యొక్క ఉద్దేశం ఆకాశమును భూమండలానికి సమీపంగా తీసుకరావడం. అనగా అల్లాహ్ తాలాతో సజీవ సంబంధాలను ఏర్పర్చడం.

(తదుపరి సంచికలో)

**సీరత్ ఖాతమున్నబియ్యీన్**
**(సల్లల్లాహు అలైహి వసల్లం):-**

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

**ఫిజార్ యుద్ధం:-**

అరబ్బులు అత్యంత యుద్ధప్రియమైన జాతి. యుద్ధం చేయడం, దానిలో ప్రాణాలు అర్పించడం తమకు గౌరవకరమైన విషయంగా భావించేవారు. అందుకే చిన్న చిన్న విషయాలకే కత్తులు దూసుకునే పరిస్థితి ఏర్పడేది. యుద్ధ సమయం వచ్చినప్పుడు ఒక పెద్ద పాత్రలో రక్తాన్ని పోసి, అందరూ అందులో తమ వేళ్లను ముంచి, "మేము పోరాడి చనిపోతాం గానీ వెనక్కి తగ్గము" అని ప్రమాణం చేసేవారు. వివిధ తెగల మధ్య పరస్పర శత్రుత్వం ఉండేది. ప్రతి తెగ తమ గౌరవం, ప్రతిష్ఠలను అత్యంత ప్రాముఖ్యంగా భావించేది. అలాంటి పరిస్థితుల్లో జాతరలు, సంతలు వంటి చోట్ల అనేక తెగల ప్రజలు కూడినప్పుడు గొడవలు చెలరేగడం అసాధారణం కాదు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బాల్యంలో ఉన్నప్పుడు, మక్కాకు తూర్పు దిశలో మూడు రోజుల ప్రయాణ దూరంలో ఉన్న సుందరమైన లోయలో జరిగే ఉకాజ్ జాతర సందర్భంగా ఖైస్ అయ్లాన్ మరియు బను కనానా తెగల మధ్య చిన్నపాటి వివాదం ప్రారంభమైంది. ఆ కాలంలో ఖైస్ అయ్లాన్‌కు చెందిన వివిధ తెగలు మక్కాకు ఆగ్నేయ దిశలో, తాయిఫ్ మరియు మక్కా మధ్య నివసించేవి. కొంతకాలం వరకు ఇరుపక్షాల నాయకులు యుద్ధం జరగకుండా అడ్డుకున్నారు. కానీ క్రమంగా సంబంధాలు మరింత ఉద్రిక్తమయ్యాయి. చివరికి యుద్ధం అనివార్యమైంది. చరిత్రలో ఈ యుద్ధాన్ని హర్బ్-ఇ-ఫిజార్ (నిషిద్ధ యుద్ధం) అని పిలుస్తారు. దీనికి ఆ పేరు రావడానికి కారణం, ఈ యుద్ధం హరమ్ ప్రాంతంలో ప్రారంభమవడమే. అరబ్బుల పురాతన సంప్రదాయం ప్రకారం హరమ్ వంటి పవిత్ర ప్రాంతంలో యుద్ధం చేయడం నిషేధించబడింది. ఈ యుద్ధం అత్యంత తీవ్రంగా సాగింది. ఇస్లాం పూర్వ కాలంలోని ప్రసిద్ధ యుద్ధాలలో ఇది ఒకటిగా గుర్తించబడింది. ఒకవైపు బను కనానా మరియు వారితో కలిసి ఖురైష్ తెగ ఉండగా, మరోవైపు ఖైస్ అయ్లాన్ మరియు వారితో కలిసి హవాజిన్ తెగ యుద్ధం చేశాయి.

ఈ యుద్ధంలో అత్యంత భీకరమైన పోరాటం నాలుగవ మరియు చివరి యుద్ధం. యుద్ధ ఉత్సాహం అంత తీవ్రంగా ఉండేది, కొందరు నాయకులు తాము పారిపోకుండా ఉండేందుకు తమను తాము తాళ్లతో కట్టించుకున్నారు. యుద్ధం ప్రారంభంలో ఖైస్ అయ్లాన్ పైచేయి సాధించింది. కానీ చివరికి బను కనానా ఆధిపత్యం సాధించగా, ఖైస్ అయ్లాన్ ఓడిపోయింది. ఆ తరువాత ఇరుపక్షాల మధ్య సంధి కుదిరింది. ఈ యుద్ధంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా పాల్గొన్నారు. అయితే కొన్ని చారిత్రక కథనాల ప్రకారం ప్రవక్త (స) స్వయంగా యుద్ధంలో పోరాడలేదు. వారి పాత్ర సైన్యంలో ఉంటూ, తన పినతండ్రులకు బాణాలను అందించడం వరకే పరిమితమైంది. ఆ సమయంలో వారి వయస్సు సుమారు ఇరవై సంవత్సరాలు.

ఈ యుద్ధంలో ప్రతి తెగకు ప్రత్యేక నాయకుడు ఉండేవాడు. బను హాషీమ్ తెగ జుబైర్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ నాయకత్వంలో ఉండగా, మొత్తం బను కనానా సేనకు హర్బ్ బిన్ ఉమయ్యా సేనాధిపతిగా ఉన్నాడు. ఇతడు అబూ సుఫ్యాన్ తండ్రి మరియు అమీర్ ముఆవియా తాత.

**హిల్ఫుల్ ఫుజూల్ :-**

ప్రాచీన కాలంలో అరబ్ దేశంలోని కొంతమంది ఉన్నత మనస్తత్వం కలిగిన వ్యక్తుల మనస్సులో ఒక ఆలోచన కలిగింది. అదేమనగా, వారు పరస్పరం ఒక ఒప్పందం చేసుకొని, ఎల్లప్పుడూ హక్కుదారుడికి అతని హక్కును ఇప్పించడంలో సహాయం చేయాలని, అలాగే అణచివేత దారుల అన్యాయాలను అడ్డుకోవాలని నిర్ణయించారు. అరబీ భాషలో "హక్కు"ను "ఫజ్ల్" అని కూడా అంటారు. దాని బహువచనం "ఫుజూల్". అందువల్ల ఈ ఒప్పందానికి "హిల్ఫుల్ ఫుజూల్" (ధర్మపరుల ఒప్పందం) అనే పేరు వచ్చింది. మరికొన్ని చారిత్రక కథనాల ప్రకారం, ఈ ఒప్పందాన్ని ప్రతిపాదించిన ముఖ్య వ్యక్తుల పేర్లలో "ఫజ్ల్" అనే పదం ఉండటం వల్ల కూడా దీనికి ఈ పేరు ప్రసిద్ధి చెందింది.

ఏదేమైనా, హర్బ్-ఎ-ఫిజార్ (ఫిజార్ యుద్ధం) అనంతరం, బహుశా ఆ యుద్ధం ప్రభావంతోనే, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి పినతండ్రి జుబైర్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ మనస్సులో ఈ ఒప్పందాన్ని మళ్లీ పునరుద్ధరించాలనే సంకల్పం కలిగింది. ఆయన పిలుపు మేరకు ఖురైష్‌కు చెందిన కొన్ని తెగల ప్రతినిధులు అబ్దుల్లాహ్ బిన్ జుద్ఆన్ ఇంటిలో సమావేశమయ్యారు. అక్కడ ఆయన ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్న అనంతరం, అందరూ కలిసి ఒక ప్రమాణం చేశారు. ఆ ప్రమాణం ప్రకారం, వారు ఎల్లప్పుడూ అన్యాయాన్ని అడ్డుకుంటామని, అణచివేయబడిన వారికి సహాయం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ ఒప్పందంలో పాల్గొన్నవారిలో బను హాషిం, బను ముత్తలిబ్, బను అసద్, బను జుహ్రా, మరియు బను తైమ్ తెగలు ఉన్నాయి.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడా ఈ సందర్భంలో అక్కడే ఉండి, ఈ ఒప్పందంలో భాగస్వామి అయ్యారు. ప్రవక్తత్వం పొందిన తరువాత ఒక సందర్భంలో వారు (స) ఇలా అన్నారు: "నేను అబ్దుల్లాహ్ బిన్ జుద్ఆన్ ఇంటిలో జరిగిన ఒక ప్రమాణంలో పాల్గొన్నాను. నేడు ఇస్లాం కాలంలో కూడా ఎవరైనా నన్ను అలాంటి ప్రమాణానికి పిలిస్తే, నేను తప్పకుండా దానికి స్పందిస్తాను."

ఈ భావన ప్రభావమే కావచ్చు. ఒకసారి అమీర్ ముఆవియా కాలంలో, ఆయన మేనల్లుడు వలీద్ బిన్ ఉత్బా బిన్ అబూ సుఫ్యాన్, అప్పట్లో మదీనాకు పాలకుడిగా ఉన్నప్పుడు, హజ్రత్ హుసైన్ (రజి.), అలీ బిన్ అబీ తాలిబ్ (రజి.) కుమారుని హక్కును అణచివేశాడు. అప్పుడు హజ్రత్ హుసైన్ (రజి.) ఇలా అన్నారు:

"అల్లాహ్ ప్రమాణంగా చెబుతున్నాను! వలీద్ నాకు నా హక్కు ఇవ్వకపోతే, నేను నా ఖడ్గాన్ని తీసుకొని మస్జిద్-ఎ-నబవీలో నిలబడి, ప్రజలను హిల్ఫుల్ ఫుజూల్ ప్రమాణం వైపు పిలుస్తాను."

ఈ మాటలు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ విన్నప్పుడు ఆయన ఇలా అన్నారు:

"హుసైన్ (రజి.) ఆ ప్రమాణం కోసం పిలిస్తే, నేను తప్పకుండా ఆయన పిలుపుకు స్పందిస్తాను. మేము ఆయనకు ఆయన హక్కు ఇప్పిస్తాము; లేకపోతే ఆ ప్రయత్నంలో మేమంతా ప్రాణాలు కోల్పోయినా వెనుకాడము."

మరికొందరు కూడా ఇదే విధముగా స్పందించారు. దాంతో వలీద్ భయపడి, చివరకు హజ్రత్ హుసైన్ (రజి.)కు ఆయన హక్కును తిరిగి ఇచ్చాడు.

గమనించదగిన విషయం ఏమిటంటే, అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ బను అసద్ తెగకు చెందిన వారు. ఈ తెగ కూడా హిల్ఫుల్ ఫుజూల్ ఒప్పందంలో పాల్గొన్న తెగలలో ఒకటి.

**ప్రవక్త (స)వారి శుభప్రదమైన రూపరేఖలు:-**

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యౌవన దశకు చేరుకున్నారు. వారి శారీరక వికాసం పూర్తయింది. అందువల్ల ఈ సందర్భంలో వారి రూపవర్ణనను తెలియజేయడం సముచితం. ప్రవక్త (స) మధ్యస్థమైన ఎత్తు కలిగి ఉండేవారు. వారి వర్ణం ఎంతో సుందరంగా ఉండేది. అతిగా తెల్లగా కాకుండా, ముదురు గోధుమగా కూడా కాకుండా, గోధుమ వర్ణానికి కొద్దిగా తెలుపు కలిసినట్లుగా ఉండేది. తల వెంట్రుకలు పూర్తిగా నిటారుగా కాకుండా, స్వల్పంగా అలలతో ఉండేవి. గడ్డం దట్టంగా, అందంగా ఉండేది. శరీర నిర్మాణం సమతుల్యంగా ఉండేది. చర్మం మృదువుగా, సున్నితంగా ఉండేది. వారి శరీరం నుంచి, అలాగే వారి చెమట నుంచి సహజమైన సువాసన వెలువడేదని చెప్పబడింది. తల కొద్దిగా పెద్దగా, ఛాతి విశాలంగా ఉండేది. చేతులు, కాళ్లు బలంగా ఉండేవి. అరచేతులు వెడల్పుగా ఉండేవి. ముఖం గుండ్రంగా, నుదురు ఎత్తుగా, ముక్కు పొడవుగా ఉండేది. కళ్ళు నల్లగా, ప్రకాశవంతంగా ఉండేవి. కనురెప్పలు పొడవుగా ఉండేవి. వారు నడిచేటప్పుడు ఎంతో గంభీరత కనిపించేది. అయితే సాధారణంగా వేగంగా అడుగులు వేస్తూ నడిచేవారు. మాట్లాడేటప్పుడు నెమ్మదిగా, స్పష్టంగా మాట్లాడేవారు. వినేవారు కోరుకుంటే వారి మాటలను ఒక్కొక్కటిగా లెక్కించగలిగేంత స్పష్టత ఉండేది. కోపం వచ్చినప్పుడు వారి ముఖం ఎర్రబడేది. సంతోష సమయంలో వారి ముఖం మరింత కాంతివంతంగా ప్రకాశించేది.

ఇంగ్లాండ్‌కు చెందిన ప్రసిద్ధ చరిత్రకారుడు సర్ విలియం మ్యూయర్ ప్రవక్త (స) వారి రూపాన్ని వర్ణిస్తూ ఇలా పేర్కొన్నాడు:

"వారి నాయకత్వ గాంభీర్యం ఒక అపరిచిత వ్యక్తి హృదయంలో మాటల్లో చెప్పలేని గౌరవభయాన్ని కలిగించేది. అయితే వారిని దగ్గరగా చూసి, పరిచయం ఏర్పడిన తరువాత, ఆ భయం క్రమంగా భక్తి, గౌరవం, ప్రేమగా మారిపోయేది."

**వ్యాపార కార్యకలాపాలు:-**

ముందు చెప్పినట్లుగా, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యౌవన దశకు చేరుకొని, జీవనోపాధి కోసం పనిచేయాల్సిన సమయం వచ్చింది. అలాగే అబూ తాలిబ్ ఆర్థిక పరిస్థితి కూడా బలంగా లేకపోవడంతో, వారి భారం తగ్గించేందుకు ప్రవక్త (స)గారు తగిన ఉపాధిని ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడింది. అందువల్ల అబూ తాలిబ్ కోరిక, ప్రోత్సాహంతో వారు వ్యాపారాన్ని ప్రారంభించారు. మక్కా నుంచి వ్యాపార బృందాలు వివిధ ప్రాంతాలకు ప్రయాణించేవి. దక్షిణాన యెమెన్, ఉత్తరాన షామ్ (సిరియా ప్రాంతం)లతో క్రమబద్ధమైన వ్యాపారం సాగేది. అదనంగా బహెరయిన్ వంటి ప్రాంతాలతో కూడా వ్యాపార సంబంధాలు ఉండేవి. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా ఈ ప్రాంతాలకు వ్యాపార నిమిత్తం ప్రయాణించారు. ప్రతి ప్రయాణంలోనూ వారు అత్యంత నిజాయితీ, విశ్వసనీయత, సమర్థతతో తమ బాధ్యతలను నిర్వహించారు. మక్కాలో కూడా వారితో వ్యాపార సంబంధాలు కలిగిన ప్రతి ఒక్కరూ వారి నిజాయితీని ప్రశంసించేవారు. సాయిబ్ అనే ఒక సహాబీ ఇస్లాం స్వీకరించిన తరువాత, కొందరు ఆయనను ప్రవక్త (స)గారి సమక్షంలో ప్రశంసించారు. అప్పుడు ప్రవక్త(స)గారు ఇలా అన్నారు:

"నాకు అతని గురించి మీకన్నా బాగా తెలుసు."

అందుకు సాయిబ్ ఇలా సమాధానమిచ్చారు: "అవును, ఓ అల్లాహ్ ప్రవక్తా! నా తల్లిదండ్రులు మీకు అంకితమవుదురు గాక!. ఒకసారి నేను వ్యాపారంలో మీ భాగస్వామిగా ఉన్నాను. మీరు ఎల్లప్పుడూ అత్యంత నిష్కపటంగా, న్యాయంగా వ్యవహరించారు."

మరో సహాబీ అబ్దుల్లాహ్ బిన్ అబీ అల్–హమ్సా ఇలా వివరించారు: "ప్రవక్తత్వం లభించకముందు ఒకసారి నేను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)తో ఒక వ్యాపార ఒప్పందం చేసుకున్నాను. నాకు వారి వద్ద కొంత బాకీ మిగిలి ఉండడంతో, 'మీరు ఇక్కడే ఉండండి, నేను వెంటనే వస్తాను' అని చెప్పాను. కానీ నేను మరిచిపోయాను. మూడు రోజుల తరువాత నాకు గుర్తుకు వచ్చి అక్కడికి వెళ్లగా, వారు అదే చోట ఉన్నారు. వారు నాతో కోపంగా ఏమీ మాట్లాడలేదు. కేవలం, 'నీవు నన్ను ఇబ్బందికి గురి చేశావు. నేను మూడు రోజులుగా నీ కోసం ఎదురుచూస్తున్నాను' అని మాత్రమే అన్నారు."

ఇది వారు మూడు రోజులు నిరంతరం అదే చోట నిలబడి ఉన్నారనే అర్థం కాదు. తగిన సమయాల్లో వారు మళ్లీ మళ్లీ అక్కడికి వచ్చి, అబ్దుల్లాహ్ కోసం చాలాసేపు వేచి ఉండేవారని భావించవచ్చు. అలా చేయడం వల్ల అబ్దుల్లాహ్ తనను వెతకాల్సిన ఇబ్బంది పడకుండా ఉండాలని వారి ఉద్దేశం.

ఇలాంటి సంఘటనల కారణంగా మక్కా ప్రజలలో వారికి "అల్–అమీన్" (నమ్మకస్తుడు) అనే బిరుదు ప్రసిద్ధి చెందింది. వారి నిజాయితీ, విశ్వసనీయత కారణంగా ప్రజలందరూ వారిని ఎంతో గౌరవించేవారు. వారు సత్యవంతులు, నమ్మదగినవారు అనే పేరు సంపాదించారు.

వ్యాపార జీవితానికి ఒక ముఖ్యమైన ప్రారంభం అప్పుడొచ్చింది. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వయస్సు సుమారు ఇరవై ఐదు సంవత్సరాలకు చేరుకున్నప్పుడు, ఖువైలిద్ కుమార్తె ఖదీజా (రజియల్లాహు అన్హా) బను అసద్ వంశానికి చెందిన అత్యంత గౌరవనీయురాలు, సంపన్నురాలు, అలాగే మక్కాలో ప్రముఖ వ్యాపారవేత్త. తన వ్యాపార సరుకును హుజూర్ (స) చేత సిరియాకు పంపించింది. తన సేవకుడు మైసరాను కూడా వారితో పంపించింది. ఈ ప్రయాణంలో ప్రవక్త (స) గారి కృషి, నిజాయితీ, అల్లాహ్ అనుగ్రహం వల్ల వ్యాపారంలో విశేష లాభం కలిగింది. వారు ఎంతో విజయవంతంగా తిరిగి వచ్చారు. అనంతరం వారు ఇతర ప్రాంతాలకు కూడా రెండు మూడు వ్యాపార ప్రయాణాలు చేశారు.

**హజ్రత్ ఖదీజా (రజి.)తో వివాహం:–**

హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా) ఒక వితంతువు మరియు సంతానం కలిగిన మహిళ. ఆమె ఇంతకు ముందు ఒకరి తరువాత ఒకరిని వరుసగా వివాహం చేసుకున్నారు. అయితే వారిద్దరూ మరణించారు. ఆమె అత్యంత గౌరవనీయురాలు, ధనవంతురాలు మరియు ఉన్నతమైన శీలం కలిగిన మహిళ. ఆమె పవిత్రత మరియు సద్గుణాల కారణంగా ఆమెకు "తాహిరా" (పవిత్రురాలు) అనే బిరుదు ప్రసిద్ధి చెందింది. అందువల్ల మక్కాలోని అనేక మంది ప్రముఖులు ఆమెకు వివాహ ప్రతిపాదనలు పంపారు. కానీ ఆమె వాటన్నింటినీ తిరస్కరించారు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)తో ఆమెకు వ్యాపార సంబంధం ఏర్పడింది. ఆ సందర్భంలో వారి ఉన్నతమైన నైతిక లక్షణాలు, విశ్వసనీయత మరియు ప్రతిభను ఆమె గమనించారు. అలాగే ఆమె సేవకుడు మైసరా కూడా ప్రవక్త (స.అ.వ.) వారి గొప్ప గుణాలను ఎంతో ప్రశంసిస్తూ చెప్పాడు. దీంతో హజ్రత్ ఖదీజా (రజి.) స్వయంగా ప్రవక్త (స.అ.వ.)కు వివాహ ప్రతిపాదన పంపించారు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన పిన్నాన్న అయిన అబూ తాలిబ్‌తో సంప్రదించిన తర్వాత ఆ ప్రతిపాదనను అంగీకరించారు. అనంతరం ప్రవక్త (స.అ.వ.) బంధువులు మరియు హజ్రత్ ఖదీజా (రజి.) సమీప బంధువులు సమావేశమయ్యారు. అబూ తాలిబ్, 500 దిర్హమ్‌ల మహర్ నిర్ణయించి, హజ్రత్ ఖదీజా (రజి.) మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ల నికాహ్ నిర్వహించారు.

ఆ సమయంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వయస్సు 25 సంవత్సరాలు, హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా) వయస్సు 40 సంవత్సరాలు. అంటే హజ్రత్ ఖదీజా (రజి.) ప్రవక్త (స.అ.వ.) కంటే 15 సంవత్సరాలు పెద్దవారు.

ఈ వివాహం జరిగే సమయానికి హజ్రత్ ఖదీజా (రజి.) తండ్రి ఖువైలిద్ బిన్ అసద్ మరణించి ఉన్నారు. అందువల్ల హజ్రత్ ఖదీజా (రజి.) తరఫున ఆమె పిన్నాన అమర్ బిన్ అసద్ ఈ నికాహ్‌లో ప్రతినిధిగా పాల్గొన్నారు.

**ఉపశాఖల వార్షిక సమావేశాలు ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

(11వ పేజీ తరువాత )

తన పేరుమీద నమోదు చేయించుకోలేదు." ఎందుకంటే ఆ కాలంలోని పరిస్థితులను బట్టి, హజ్రత్ సాహిబ్ భావించినది ఏమిటంటే, ఏమైనప్పటికీ మిర్జా సుల్తాన్ అహ్మద్ గారికి తన ఆస్తిలో సగం భాగం రావాల్సిందే. మిగిలిన సగం మిర్జా ఫజల్ అహ్మద్ గారికి చెందుతుంది. కాబట్టి, తన జీవితకాలంలోనే మిర్జా సుల్తాన్ అహ్మద్ గారి వాటాను వేరుగా కేటాయించినట్లే భావించారు.

**(25) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా (తల్లి గారు) నాకు ఇలా చెప్పారు:** మిర్జా ఫజల్ అహ్మద్ గారు మరణించిన కొంతకాలం తర్వాత, హజ్రత్ సాహిబ్ నాతో ఇలా అన్నారు: "నీ పిల్లలతో కలిసి ఆస్తిని పంచుకోవాల్సిన వారిలో ఫజల్ అహ్మద్ ఒక్కడే ఉండేవాడు. పాపం, అతను కూడా మరణించాడు." ఈ భవదీయుడు తెలియజేయునదేమనగా, మా తాతగారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకరు హజ్రత్ సాహిబ్, వారి పేరు మిర్జా గులామ్ అహ్మద్ గారు. రెండవ వారు మా పెద్దనాన్న మిర్జా గులామ్ ఖాదిర్ సాహిబ్, ఆయన హజ్రత్ సాహిబ్ కంటే పెద్దవారు. మా తాతగారు ఖాదియాన్ ప్రాంతంలోని భూమిలో రెండు గ్రామాలను నివసింపజేసి, వాటికి తన ఇద్దరు కుమారుల పేర్లను పెట్టారు. ఒక గ్రామానికి ఖాదిరాబాద్ అని, మరొక గ్రామానికి అహ్మదాబాద్ అని పేరు పెట్టారు. తరువాత ఏదో కారణంగా అహ్మదాబాద్ గ్రామం మా కుటుంబం చేతుల నుండి వెళ్లిపోయింది. ఖాదిరాబాద్ మాత్రమే మా కుటుంబంలో మిగిలింది. అనంతరం ఖాదిరాబాద్ గ్రామం హజ్రత్ సాహిబ్ సంతానం మధ్య విభజించబడింది. ఆ విభజనలో మిర్జా సుల్తాన్ అహ్మద్ గారికి కూడా ఒక వాటా వచ్చింది. అయితే, దేవుని చిత్తం ఎంత విశేషమో చూడండి. సుమారు నలభై సంవత్సరాల తర్వాత, మా కుటుంబం నుండి వెళ్లిపోయి ఇతరుల చేతికి చేరిన అహ్మదాబాద్ గ్రామం మళ్లీ మా కుటుంబానికి తిరిగి వచ్చింది. ఇప్పుడు అది పూర్తిగా మా ముగ్గురు సోదరుల అధీనంలో ఉంది. అందులో మిర్జా సుల్తాన్ అహ్మద్ గారికి ఎలాంటి వాటా లేదు. ఇంకా నేను తెలియజేయదలచుకున్నది ఏమిటంటే, ఖాదిరాబాద్ ఖాదియాన్‌కు తూర్పు దిశలో ఉంది. అహ్మదాబాద్ ఉత్తర దిశలో ఉంది.

**(26) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా (తల్లి గారు) నాకు ఇలా చెప్పారు:** డాక్టర్ మీర్ ముహమ్మద్ ఇస్మాయిల్ సాహెబ్ (ఈ భవదీయుడికి స్వయానా మామయ్య) మాతో ఇలా వివరించారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) లూధియానాలో తమను తాము మసీహ్‌గా ప్రకటించినప్పుడు, నేను చిన్న పిల్లవాడిని. బహుశా మూడో తరగతిలో చదువుతున్నాను. ఆ ప్రకటన గురించి నాకు ఏమీ తెలియదు. ఒక రోజు నేను మదరసాకు వెళ్లగా, కొంతమంది బాలురు నాతో ఇలా అన్నారు: "మీ ఇంట్లో ఉంటున్న ఖాదియాన్‌కు చెందిన మిర్జా సాహెబ్, హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) మరణించారని, అలాగే రాబోయే మసీహ్ తానేనని ప్రకటించారు." డాక్టర్ సాహెబ్ చెప్పిన ప్రకారం, నేను వారి మాటలను ఖండిస్తూ, "అది ఎలా సాధ్యం? హజ్రత్ ఈసా సజీవంగా ఉన్నారు. వారు ఆకాశం నుండి తిరిగి అవతరిస్తారు" అని అన్నాను. ఆ తర్వాత నేను ఇంటికి వచ్చాను. అప్పటికే హజ్రత్ సాహెబ్ కూర్చుని ఉన్నారు. నేను వారిని ఉద్దేశించి, "మీరు తామే మసీహ్ అని ప్రకటించుకున్నట్లు విన్నాను" అని అన్నాను. డాక్టర్ సాహెబ్ చెప్పినట్లుగా, నా ప్రశ్న విన్న వెంటనే హజ్రత్ సాహెబ్ నిశ్శబ్దంగా లేచి, గదిలోని అల్మారాలో నుండి వారు (అ) కొత్తగా రచించిన "ఫత్–ఉల్–ఇస్లాం" అనే పుస్తక ప్రతిని తీసుకొని వచ్చి నాకు ఇచ్చి, "దీనిని చదువు" అని అన్నారు. డాక్టర్ సాహెబ్ చెప్పేవారు: "హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి సత్యనిష్ఠకు ఇదే ఒక నిదర్శనం. ఒక చిన్న పిల్లవాడు అడిగిన సాధారణ ప్రశ్నను కూడా వారు (అ) ఎంతో గంభీరంగా తీసుకొని సమాధానం ఇచ్చారు. లేకపోతే, దానికి ఏదో మాట చెప్పి సులభంగా తప్పించుకోవచ్చు."

**(27) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా (తల్లి గారు) నాకు ఇలా చెప్పారు:** ఖాజీ అమీర్ హుసైన్ సాహెబ్ మాతో ఇలా వివరించారు: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి వెంట్రుకలను సహాబాలు (ప్రవక్త సహచరులు) ఆశీర్వాదం (బరకత్) కోసం భద్రపరచుకునే వారని నేను హదీస్‌లో చదివాను. ఆ ఆలోచనతో, ఒక రోజు నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారిని ఉద్దేశించి, "హుజూర్! దయచేసి మీ వెంట్రుకల్లో కొంత నాకు ప్రసాదించండి" అని వినతిచేశాను. ఆ తరువాత హుజూర్ (అ) క్షౌరం చేయించుకున్నప్పుడు, తన వెంట్రుకల్లో కొంత భాగాన్ని నాకు పంపించారు. ఈ భవదీయుడు తెల్పునదేమనగా, నా వద్ద కూడా హజ్రత్ సాహెబ్ వారి కొంత వెంట్రుకలు భద్రంగా ఉన్నాయి.

( తరువాయి భాగం తదుపరి సంచికలో చదవగలరు)

## సీరతుల్ మహ్ది
### (అలైహిస్సలాతు వస్సలాం):-
రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

**(21) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా (తల్లి గారు) నాకు ఇలా చెప్పారు:** హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) తనను మసీహ్‌గా ప్రకటించు సమయంలో వారు ఖాదియాన్‌లో ఉన్నారు. ఈ విషయానికి సంబంధించిన తొలి చిన్న గ్రంథాలను (రిసాలాలను) అక్కడే రచించారు. అనంతరం లుధియానాకు వెళ్లి, అక్కడి నుంచే తన ప్రకటనను బహిరంగంగా ప్రచారం చేశారు. వాలిదా సాహిబా మరల ఇలా తెలిపారు: తన వాగ్దానమును ప్రకటించుటకు ముందు హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) నాతో ఇలా అన్నారు: "నేను ఇప్పుడు ఒక విషయాన్ని ప్రకటించబోతున్నాను. దాని కారణంగా దేశమంతటా తీవ్రమైన వ్యతిరేకత, కలకలం చెలరేగుతుంది." ఆ ప్రకటన తర్వాత ప్రారంభంలో బైఅత్ చేసిన కొంతమంది కూడా వెనక్కి తగ్గారు.


**(22) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా (తల్లి గారు) నాకు ఇలా చెప్పారు:** ఒకసారి హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) సియాల్కోట్ లో మీర్ హామిద్ షా సాహెబ్ ఇంటిలో బసచేసి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ సమయంలో వారి నోటి నుండి ఒక వాక్యం వెలువడటం నేను విన్నాను. అది దైవిక ప్రకటన (వహీ) అని నేను భావించాను. కొద్దిసేపటి తరువాత వారు మేల్కొనగానే నేను ఇలా అడిగాను: "మీకు ఇప్పుడు వహీ అందినదా?" అందుకు హుజూర్ (అ) ఇలా సమాధానమిచ్చారు: "అవును. ఆ విషయం నీకు ఎలా తెలిసింది?".నేను ఇలా విన్నవించుకున్నాను: "మీ నోటి నుండి అట్టి మాటలు వినిపించాయి." ఆ తర్వాత నేను మా తల్లిగారిని ఇలా అడిగాను: "వహీ అవతరించే సమయంలో హజ్రత్ గారి పరిస్థితి ఎలా ఉండేది?" వాలిదా సాహిబా ఇలా సమాధానమిచ్చారు: "హుజూర్ (అ) ముఖం ఎర్రగా మారిపోయేది. నుదిటిపై చెమట పట్టేది."

ఈ భవదీయుడు కూడా ఒక సంఘటనను తెలియజేస్తున్నాడు:

ఒకసారి హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) తమ ఇంటి చిన్న ప్రాంగణంలో (ప్రస్తుతం మా తల్లి గారి ప్రాంగణం) ఒక కర్ర మంచంపై కూర్చున్నారు. అది బహుశా ఉదయం లేదా సాయంత్ర సమయం అయి ఉండవచ్చును. నిద్రమత్తు రావడం వలన హుజూర్ (అ) కొద్దిసేపు పడుకున్నారు. అప్పుడు వారి పెదవుల నుండి కొన్ని మాటలు వినిపించాయి. కానీ వాటి అర్థం మాకు స్పష్టంగా తెలియలేదు. ఆ తరువాత హుజూర్ (అ) మేల్కొని ఇలా అన్నారు: "ఇప్పుడే నాకు ఈ వహీ అందింది." అయితే ఆ వహీ ఏమిటో ఈ భవదీయుడికి ప్రస్తుతం గుర్తుకు లేదు. వాలిదా సాహిబా ఇలా తెలిపారు: దైవవాణి అందిన వెంటనే హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) మేల్కొని దానిని లిఖించేవారు. ప్రారంభంలో సాధారణ పుస్తకాల్లో గమనికగా రాసుకునేవారు. తరువాత పెద్ద పరిమాణంలో ఒక నోటుబుక్ తయారు చేయించారు. ఆ తరువాత చిన్నదైనా మందంగా ఉండే మరో నోటుబుక్ తయారు చేయించుకున్నారు. నేను అడిగాను: "ఆ నోటుబుక్ ఇప్పుడు ఎక్కడ ఉంది?" వాలిదా సాహిబా ఇలా సమాధానమిచ్చారు: "అది మీ అన్నగారి వద్ద ఉంది." (ఇక్కడ "అన్న" అనగా హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ సాహెబ్, ఖలీఫతుల్ మసీహుస్సాని రజి గారు) అలాగే మా మామగారు డాక్టర్ మీర్ ముహమ్మద్ ఇస్మాయీల్ సాహెబ్ కూడా ఒకసారి హజ్రత్ గారిపై దైవవాణి అవతరిస్తున్న దృశ్యాన్ని తాను ప్రత్యక్షంగా చూశానని చెప్పేవారు.

**(23) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా (తల్లి గారు) నాకు ఇలా చెప్పారు:** ఈ భవదీయుడు తెలియజేయునదేమనగా, తమ జీవిత చివరి కాలంలో హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) వంకర మొన కలిగిన కలంతో రచనలు చేసేవారు. గీతలు లేని తెల్ల కాగితాన్ని ఉపయోగించేవారు. కాగితాన్ని తీసుకున్న తరువాత రెండు వైపులా మడత వేసి, ఇరువైపులా తెల్లని అంచు (మార్జిన్) ఉండేలా చేసుకునేవారు. హుజూర్ (అ) నల్ల సిరాతో కూడా, నీలం-నలుపు సిరాతో కూడా వ్రాసేవారు. సిరాబుడ్డి పడిపోకుండా ఉండేందుకు మట్టితో చేసిన చిన్న ఆధారంలో దానిని అమర్చించుకునేవారు. రాస్తున్నప్పుడు సాధారణంగా నడుస్తూ కూడా వ్రాసేవారు. సిరాబుడ్డిని ఒక చోట ఉంచి, అక్కడి నుండి వెళ్లేటప్పుడు కలం మొనను మళ్లీ సిరాలో ముంచి వ్రాయడం కొనసాగించేవారు. రాస్తూనే తాము వ్రాసిన దాన్ని మెల్లగా చదువుకుంటూ ఉండేవారు. ఆ సమయంలో వారి పెదవుల నుండి మృదువైన గుసగుసల వంటి శబ్దం వినిపించేది. అయితే వినేవారికి మాటలు స్పష్టంగా అర్థం అయ్యేవికావు. నేను మిర్జా సుల్తాన్ అహ్మద్ సాహెబ్ చదివే విధానాన్ని కూడా విన్నాను. అది హజ్రత్ వారి విధానంతో చాలా పోలి ఉండేది. హుజూర్ (అ) చేతిరాత దృఢంగా ఉన్నప్పటికీ కొద్దిగా వంకరగా, సంక్షిప్తంగా ఉండేది. అలాంటి రాతకు అలవాటు లేని వారు సులభంగా చదవలేరు. అవసరమైతే తాను రాసిన పదాలను కొట్టివేసి, వాటి స్థానంలో కొత్త పదాలను కూడా రాసేవారు. అందువల్ల వారి రచనల్లో కొట్టివేసిన భాగాలు తరచుగా కనిపించేవి. వారు వ్రాసిన అక్షరాలు కూడా చాలా సూక్ష్మంగా ఉండేవి.

లేఖలోని ఒక భాగం (ప్రతిలిపి):





'ఇవే కాకుండా, నా సంతానం యొక్క వివాహాల గురించి కూడా నాకు ఒక ఆలోచన ఉంది. వారు వివాహం చేసుకునే అమ్మాయిలు ధార్మిక విద్యను అభ్యసించి ఉండాలి. కొంతమేరకు అరబీ, ఫార్సీ, ఆంగ్ల భాషల్లో కూడా విద్య అభ్యసించి వుండాలి. పెద్ద కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహించే వివేకం, సామర్థ్యం కలిగి ఉండాలి. ఈ అన్ని మంచి లక్షణాలతో పాటు ఈ గుణాలు కూడా ఉండాలని నా కోరిక. అయితే ఇవన్నీ అల్లాహ్ తఆలాకు ప్రీతిపాత్రమైన విషయాలే. పంజాబ్‌లోని గౌరవనీయ కుటుంబాల్లో అమ్మాయిల విద్యపై అంతగా శ్రద్ధ చూపడం లేదు. ఫలితంగా వారు అడవివారిలా పెరిగిపోతున్నారు."

ఈ రచయిత తెలియజేస్తున్నది ఏమిటంటే, పై భాగం హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) 1899 సంవత్సరంలో మిర్జా మహ్మూద్ బేగ్ సాహెబ్ (పట్టి) గారికి రాసిన ఒక లేఖ నుండి తీసుకోబడింది.

**(24) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా (తల్లి గారు) నాకు ఇలా చెప్పారు:** మీ పెద్దనాన్న (మిర్జా గులామ్ ఖాదిర్ సాహెబ్, అనగా హజ్రత్ సాహెబ్ గారి పెద్ద అన్నయ్య) సంతానం లేకుండానే మరణించినప్పుడు, మీ పెద్దమ్మ హజ్రత్ సాహెబ్ వద్దకు వచ్చి కన్నీళ్లు పెట్టుకుంటూ ఇలా అన్నారు: "నా భర్త ఆస్తిని సుల్తాన్ అహ్మద్ పేరు మీద దత్తపుత్రునిగా నమోదు చేయించండి. ఆస్తి ఏమైనా ఇప్పుడు మీకే చెందుతుంది. ఇలా చేసినా కూడా మీ కుటుంబంలోనే ఉంటుంది." అందుకు హజ్రత్ సాహెబ్, మీ పెద్దనాన్నగారి మొత్తం ఆస్తిని మిర్జా సుల్తాన్ అహ్మద్ గారి పేరు మీద నమోదు చేయించారు. నేను వాలిదా సాహిబా గారిని అడిగాను: "హజ్రత్ సాహెబ్ దత్తపుత్రుని (ముతబన్నా)గా అంగీకరించుటకు ఎలా సమ్మతించారు?" అందుకు తల్లి గారు ఇలా చెప్పారు: "అది కేవలం చెప్పుకోవడానికే వరిస్తుంది. వాస్తవానికి మరణం తర్వాత దత్తపుత్రుడు అనే విషయం ఎలా ఉంటుంది? అసలు ఉద్దేశ్యం ఏమిటంటే, మీ పెద్దమ్మ సంతోషం కోసం హజ్రత్ సాహెబ్, మీ పెద్దనాన్నగారి ఆస్తిని మిర్జా సుల్తాన్ అహ్మద్ పేరుమీద నమోదు చేయించారు. (10వ పేజీలో చదవగలరు)

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

EDITOR : SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
e-mail:
akhbaarbadarteluguqdn@gmail.com
www.akhbarbadr.in

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA తెలుగు వార పత్రిక
POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 13 AUG 2026, Issue No : 33

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail
managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)



**సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.**

**నేడు " అహ్మదియ్య సెంటర్ మెల్బోర్న్ " ప్రారంభోత్సవం రోజు. మధ్యాహ్నం ఒంటి గంటకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు విచ్చేసి, బయటి గోడకు ఉన్నటు వంటి ఫలకపు వస్త్రాన్ని తొలగించి, ఆపై దుఆ చేశారు.**

**(గత సంచిక తరువాత)**

1922లో అహ్మదియ్య ముస్లిం జమాఅత్ అమెరికాకు చెందిన " దా ముస్లిం సన్ రైజ్ " అనే సంచికకు చెందిన 4వ సంచికలో వారి (రజి గారి ) ఒక వ్యాసం ప్రచురించబడింది. వారి రజి (గారి ఫోటో) కూడ ప్రచురించబడింది. వారు రజి తాము అహ్మదియ్యత్‌ను స్వీకరించిన విషయాన్ని ప్రస్తావించారు. వారు తమ వ్యాసంలో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారితో సమావేశమైన విషయాన్ని ప్రస్తావించుతూ ఈ విధముగా వ్రాసారు:

" నా తూర్పు దేశాల పర్యటనలో భాగంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారిని విషయంలో నన్ను హెచ్చరించడం జరిగింది. కాని నేను ఖాదియాన్ వెళ్ళిన తరువాతయే నా అనుమానాలన్నియు దూరమైపోయాయి. మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను గూర్చి అల్లాహ్ తాలా చేసిన భవిష్యవాణులు అన్నియు వారి (హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని(అ)) గారిలో పూర్తి గావించబడ్డాయనే ఆధారాలు నాకు ఒక అద్భుత ఆధ్యాత్మిక ప్రభావం ద్వార తెలిసి పోయింది. 1903లో ఖాదియాన్‌లో హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని (అ) గారిని కలవడం ఇస్లాం సత్యనిదర్శనకు ఎంతో అద్భుత ఆధారం. ఎవరి గురించి అయితే 13 శతబ్ధాల ముందు భవిష్యవాణి రూపంలో పదాలను పేర్కొనడం జరిగిందో అవన్నియు వారి (హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని(అ))లో పూర్తి గావించబడ్డాయి. నా జీవితంలో నేను చేసిన పర్యటనన్నింటిలో చోటు చేసుకున్న సంఘటణల విషయానికి వచ్చినచో ఇలాంటి అద్భుత సంఘటన ఎన్నడు జరుగలేదు. నేను ఖాదియాన్ నగరంలో, ఆ నగరపు మసీహ్ ముందు నిలబడినప్పుడు, నన్ను వారి ముందు ప్రవేశపెట్టినప్పుడు, మా చూపులు కలిసినప్పుడు, వారు నన్ను చూడడంతోనే నేను సత్యాన్వేషణకు వచ్చానని వారు గ్రహించారు. నేటి కాలంలో విశ్వాసులను ఏకం చేయుటకు మరియు ఇస్లాంను ప్రపంచ వ్యాప్తముగా వ్యాపింప జేయుటకు అవతరింపబడిన ఆ దైవాంశజనుడు వీరే అని నేను అర్థం చేసుకున్నాను. అల్లాహ్ తాలాయే ఈ కలయిను ఏర్పాటు చేశాడని నేను విశ్వసించసాగాను. అతడే నా శరీరంలో, నా ఆత్మలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పట్ల అభిమానంను నింపాడు. చివరికి అనేక మాసాలు, ఆలోచించి, పరిశోధించి, దుఆలు చేసిన తరువాత ఏప్రిల్ 1906లో నేను అహ్మదియ్య ముస్లిం జమాఅత్ ఖాదియాన్‌కు చెందిన ఒక సభ్యుడిని అని ప్రకటన చేశాను. ఈ విధముగా నేను ప్రపంచ వ్యాప్తముగా ఇస్లామీయ బోధనలను వ్యాపింపజేయునట్టి అన్నిటి కంటే ఉత్తమమైన, చురుకైన ముహమ్మదిన్ మిష్నరీ అసోసియేషన్‌తో అనుబంధాన్ని పెంచుకున్నాను. ఈ ప్రకటనను నేను ప్రపంచంలోనే సూదుర దేశమైన న్యూజిలాండ్ నుండి పంపించడం జరిగింది.

నేను పైన వ్రాసిన అక్షరాలను, నిండు మనస్సుతో, పూర్తి నమ్మకంతోనే వ్రాసాను. నేటి నుండి 19 సంవత్సరాలకు పూర్వం నాకు నేను ఖాదియాన్‌లో వీడ్కొలు చెప్పుకున్నాను. ఆనాటి నుండి నేను వారి సత్యతను బలపరుస్తున్నాను. మరియు ముఫ్తి ముహమ్మద్ సాధిఖ్ సాహెబ్ రజి గారు ఇక్కడికి వచ్చిన తరువాత నేను ఈ ఆర్టికల్ ద్వార నేను అహ్మదియ్య ముస్లిం జమాఅత్ సభ్యుడినే అని నా వాగ్దానమును పునరుద్దరణ చేస్తున్నాను. గతంలో నుండే నేను ఇక్కడ ముఫ్తి ముహమ్మద్ సాధిఖ్ సాహెబ్ రజి గారికి సహాయం చేస్తూ వస్తున్నాను. ఇక ముందు కూడ భవిష్యత్తులో ఇస్లాం ప్రచార కార్యక్రమాలలో వారికి సహాయం అందిస్తూనే ఉంటాను.

వారు ముందుగా అమెరికాలోని కాలిఫోర్నియా, ఫ్రెష్నోలో జీవించేవారు. ఆ తరువాత 1914లో లాస్ ఏంజిల్‌కు వలస వెళ్ళిపోయారు. వారు లాస్ ఏంజిల్‌లోనే మృతి చెందారు. వారు మృతి చెందిన సంవత్సరం స్పష్టముగా పొందుపర్చబడలేదు. వారిని లాస్ ఏంజీల్‌లోని ఫారెస్ట్ లావన్ గ్లెండెన్ అనే ఖబరస్తాన్‌లో సమాధి చేశారు.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు తమ ఈ సంవత్సరపు లాస్ ఏంజిల్ (అమెరికా) పర్యటనలో అమెరికాకు చెందిన ముభల్లిఘ్ సిల్‌సిలా గౌ॥ ఇనాముల్ హఖ్ కౌసర్ సాహెబ్ గారికి క్రీ॥ శే॥ చార్లేస్ ఫ్రాన్సిస్ గారి కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నారో, వారి సంతానం, వారి వారసులు ఎక్కడున్నారు? ఎక్కడికి వలస వెళ్ళారు? అనే విషయాలను కనిపెట్ట గలరని సూచించారు.

(అమెరికా జమాఅత్ ఈ విషయంలో తమ అన్వేషణలు చేస్తూనే ఉన్నది.)

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఉదయం 5గంటల 30 నిమిషాలకు మస్జిద్‌కు చేరుకోని ఫజర్ నమాజ్ చదివించారు. నమాజ్ తరువాత హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు తమ నివాసమునకు తిరిగి వెళ్ళారు.

ఉదయం వేళ హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అనేక శాఖలకు చెందిన కార్యాలయ కార్యక్రమాలను పూర్తి చేయుటలో ఉన్నారు.

ఈ రోజు శుభప్రదమైన శుక్రవారం రోజు కావున, అస్ట్రేలియాకు చెందిన మెల్బొనియా నగరం నుండి ఖలీఫతుల్ మసీహ్ గారి జుమా ప్రసంగాన్ని ఎంటిఏ ద్వారా మొదటి సారిగా ప్రపంచ వ్యాప్తముగా ప్రత్యక్ష ప్రసారంలో వినడం మరియు చూడడం జరుగుతుంది. గతంలో ఎన్నడు కూడ మెల్బొనియా నుండి ఎంటిఏ ప్రత్యక్ష ప్రసారాలు చేయలేదు. ఇంతకు ముందు ఎన్నడు ఖలీఫతుల్ మసీహ్ ఈ నగరంలో జుమా ప్రసంగం గాని, ఉపన్యాసం గాని చేయలేదు.

**అహ్మదియ్య సెంటర్ మెల్బోర్న్ ప్రారంభోత్సవం.**

నేడు " అహ్మదియ్య సెంటర్ మెల్బోర్న్ " ప్రారంభోత్సవం రోజు. మధ్యాహ్నం ఒంటి గంటకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు విచ్చేసి, బయటి గోడకు ఉన్నటు వంటి ఫలకపు వస్త్రాన్ని తొలగించి, ఆపై దుఆ చేశారు.

జుమా ప్రసంగం:

ఆ తరువాత హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు పురుషుల సభా ప్రాంగణంలోకి చేరుకోని జుమా ప్రసంగాన్ని ప్రారంభించారు.

తషహ్హుద్, తవూజ్ మరియు తస్మియ పఠనాంతరం హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా ప్రసంగించారు.

" హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక చోట ఇలా తెలిపారు. విశ్వాసాన్ని బలపర్చుటకు మరియు అల్లాహ్ ఉనికిని ప్రజల ముందు నిరూపించి చూపబడుటకు నేను పంపబడ్డాను. ఎందుకనగా ప్రతి జాతి యొక్క విశ్వాస స్థితి చాలా బలహీనముగా ఉన్నది.

పరలోక జీవితాన్ని కేవలం ఒక కథలాగా భావిస్తున్నారు. అంతేగాకుండా ప్రతి వ్యక్తి తన నడవడిక ద్వార, తనకు ప్రపంచం మరియు ప్రపంచ సామాగ్రిపై నమ్మకం ఉన్నట్లుగా, ప్రపంచం మరియు దాని సామాగ్రిపై విశ్వాసం ఉన్నట్లుగా అల్లాహ్ తాలా మరియు పరలోక జీవితంపై నమ్మకంగాని, విశ్వాసం గాని లేదని చెప్పకనే చెబుతున్నాడు. వారి నోటి నుండి ఎన్నో విషయాలు వెలువడుతున్నాయి, కాని మనస్సుపై మాత్రం ప్రాపంచిక ప్రేమయే ఆధిక్యతను చాటుచున్నది. హజ్రత్ మసీహ్ కూడ ఇలాంటి స్థితిలోనే యూదులు ఉండడాన్ని చూశారు. విశ్వాస బలహీనతకు ఉండే ప్రత్యేకత ప్రకారంగానే యూదుల వ్యవహార శైలి కూడ చాలా నీచముగా మారిపోయింది. (8వ పేజిలో చదువుము)

**131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

**( నజారత్ ఇస్లాహ్ ఇర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్ )**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz